# విశాల భారతి

తెలుగు దినపత్రిక

15-05-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 131


## సీతక్క శాఖలో అన్ని అక్రమాలే



02

## చివరి గింజ వరకు కొంటాం



- ప్రతి గింజను మద్దతు ధరకే కొంటామని మంత్రుల హామీ
- కొనుగోలు, రవాణా ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం
- ఇప్పటికే రూ. 4,600 కోట్లు రైతుల ఖాతాల్లోకి జమ
- తరుగు పేరుతో మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవు
- రాష్ట్రవ్యాప్తంగా 90 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

02

# చట్టం బండి చుట్టమా..?

- బండి సంజయ్ కుమారుడిపై 'పోక్సో' కేసు నమోదు
- పోలీసులకు దొరకకుండా భగీరథ్ అజ్ఞాతం
- అరెస్ట్ చేయకుండా కేవలం నోటీసులకే పరిమితం
- కుమారుడు పరారీలో ఉన్నా రోడ్ షోలు నిర్వహించడం
- వ్యవస్థల పక్షపాత వైఖరిపై నెటిజన్ల ట్రోల్స్
- అరెస్ట్ తప్పించుకోవడానికి హైకోర్టులో పిటిషన్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయ యవనికపై ప్రస్తుతం ఒక సంచలన ఉదంతం దావానలంలా వ్యాపిస్తోంది. పోక్సో చట్టం కింద తీవ్ర అభియోగాలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్ అదృశ్యం కావడం పెను దుమారం రేపుతోంది. కేవలం సదరు యువకుడే కాకుండా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న తండ్రి బండి సంజయ్ సైతం పోలీసుల కంటికి చిక్కకుండా ఉండటం విస్మయానికి గురిచేస్తోంది. గత కొన్ని రోజులుగా చోటుచేసుకుంటున్న పరిణామాలు గమనిస్తే ప్రభుత్వ వ్యవస్థల పనితీరుపై సామాన్యుల్లో అనేక అనుమానాలు మొలకెత్తుతున్నాయి. మే 8వ తేదీన కేసు నమోదైనప్పటికీ ఇప్పటి వరకు నిందితుడిని కనీసం విచారించకపోవడం గమనార్హం. అధికారులు మీనమేషాలు లెక్కించడం విమర్శలకు తావిస్తోంది. ఈ వ్యవహారాన్ని ఛేదించేందుకు ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందాన్ని రంగంలోకి దించింది. మే 13 వ తేదీ మధ్యాహ్నం 14:00 గంటల కల్లా విచారణకు హాజరు కావాలని




నిందితుడికి హుకుం జారీ అయింది. అయితే కనిపించకుండా పోయిన వ్యక్తికి నోటీసులు ఎలా చేరాయనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. పోలీసులు సుమారు 160 కిలోమీటర్ల మేర ప్రయాణించి కరీంనగర్‌లోని మంత్రి నివాసానికి చేరుకున్నారు. అక్కడ కుటుంబ సభ్యులెవరూ మిగతా 3లో..

# కాన్వాయ్ తగ్గితే కడుపు నిండుతుందా?

## పొదుపు కోసం ప్రధాని, సీఎంల కాన్వాయ్ తగ్గింపు

**చమురు పొదుపు మంత్రం జపిస్తూ పాలకులంతా ఇప్పుడు కాన్వాయ్ వాహనాల సంఖ్యను తగ్గించుకునే పనిలో పడ్డారు. ప్రధాని మోదీ మొదలుపెట్టిన ఈ సంప్రదాయాన్ని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు కూడా అందిపుచ్చుకున్నారు. తొమ్మిది వాహనాలు ఉన్న చోట అయిదుకు పరిమితం చేయడం, మంత్రుల వాహనాలపై ఆంక్షలు విధించడం పబ్లిసిటీ స్టంట్‌గా బాగానే ఉన్నా, నిత్యావసరాల ధరల భారంతో సతమతమవుతున్న సామాన్యుడికి ఇది ఎలా ఊరటనిస్తుందనేది పెద్ద ప్రశ్న. పెట్రోల్ ధరలు పెరుగుతాయనే వార్తలు, సిలిండర్ ధర సామాన్యుడి బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నప్పుడు, కేవలం నాలుగు కార్లు తగ్గించడం వల్ల ప్రభుత్వ ఖజానాకు వచ్చే లాభం ఎంత? ఈ పొదుపు చర్యలు కేవలం కంటితుడుపు వ్యవహారంగానే కనిపిస్తున్నాయి. ప్రజా ప్రతినిధుల విలాసాలకు వెచ్చించే వేల కోట్ల ప్రజాధనంలో ఈ వాహనాల తగ్గింపు అనేది సముద్రంలో కాకి రెట్ట లాంటిది. పాలకులు నిజంగానే చమురు పొదుపుపై చిత్తశుద్ధి ప్రదర్శించాలనుకుంటే ముందుగా పెట్రో ధరల నియంత్రణపై దృష్టి సారించాలి.**



- ఇది కేవలం రాజకీయ జిమ్మిక్కు అని విమర్శలు
- ఆకాశాన్నంటుతున్న పెట్రోల్, గ్యాస్, నిత్యావసరాల ధరలు
- సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరిన పసిడి ధర
- ప్రభుత్వ వ్యయంలో ఈ పొదుపు సముద్రంలో కాకిరెట్ట
- అలంకార మార్పులు కాక, పన్నులు తగ్గించాలని డిమాండ్


**ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను గమనిస్తే సగటు మనిషి బతుకు ఛిన్నాభిన్నమవుతోంది. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుంటే, సామాన్యుడి ఆదాయం మాత్రం పాతాళంలోనే ఉంది. బంగారం ధరలు తులానికి రూ.1,78,296 నుండి రూ.1,85,880 వ మార్కును తాకుతూ మధ్యతరగతి కలలను చెరిపేస్తున్నాయి. గ్యాస్ కొరత కారణంగా హోటళ్లలో తిండి ధరలు పెరిగి సామాన్యుడు బయట తినాలన్నా భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రభుత్వం ఈ వాస్తవ సమస్యలను వదిలేసి, కాన్వాయ్‌లు తగ్గించామంటూ చేస్తున్న ప్రచారం హాస్యాస్పదంగా ఉంది. వర్క్ ఫ్రమ్ హోమ్ వల్ల ఇంధనం ఆదా అవుతుందని ప్రధాని చెప్పడం గొప్పగా ఉన్నా, క్షేత్రస్థాయిలో రవాణా వ్యవస్థ మెరుగుపడకపోతే ప్రయోజనం శూన్యం. ప్రజా రవాణా వ్యవస్థలను బలోపేతం చేయకుండా, సామాన్యుల వాహనాలకు పన్నుల భారం వేస్తూ, పాలకులు మాత్రం కేవలం తమ కాన్వాయ్‌లలో రెండు కార్లు తగ్గించి త్యాగధనులుగా ముద్ర వేయించుకోవాలని చూడటం సరికాదు. ఆర్థిక కోణంలో చూస్తే కాన్వాయ్ తగ్గింపు వల్ల కలిగే పొదుపు నామమాత్రమే. ఒక ముఖ్యమంత్రి కాన్వాయ్‌లో నాలుగు వాహనాలు తగ్గించడం వల్ల నెలకు కొన్ని వేల రూపాయల చమురు ఖర్చు తగ్గొచ్చు. కానీ రాష్ట్రం మొత్తం మీద పెట్రోల్, డీజిల్ ధరల పెరగడం వల్ల ప్రజలపై పడుతున్న భారం లక్షల కోట్లలో ఉంటోంది. ప్రభుత్వం వ్యాట్ తగ్గించి పెట్రో ధరలను అదుపులోకి తెస్తే వచ్చే ఫలితం సామాన్యుడికి ప్రత్యక్షంగా చేరుతుంది. అది చేయకుండా ఇలాంటి ప్రతీకాత్మక చర్యలు చేపడితే ప్రజల్లో విశ్వసనీయత ఉండదు. ఇంధన ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు పెరిగి పండ్లు, కూరగాయల ధరలు మిగతా 2లో..

## ఇంటర్ విద్యలో సరికొత్త అధ్యాయం

- సైన్స్ విద్యార్థులకు ఇకపై ఫస్టియర్‌లోనే ప్రాక్టికల్స్ ప్రారంభం
- సైన్స్ థియరీ 60 మార్కులకు, ఆర్ట్స్ థియరీ 80 మార్కులకు తగ్గింపు
- మ్యాథ్స్, ఆర్ట్స్ సబ్జెక్టుల్లో 20 మార్కులకు ఇంటర్నల్స్ కేటాయింపు
- అకౌంటెన్సీ, కామర్స్, ఎకనామిక్స్ గ్రూప్ ఏర్పాటు
- క్యూఆర్ కోడ్‌లు, కొత్త సిలబస్‌తో ఆధునిక పాఠ్యపుస్తకాలు
- మే 12 నుండి ప్రవేశాలు షురూ; జూన్ 1న పుస్తకాల పంపిణీ




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి జూనియర్ కాలేజీల విద్యా విధానంలో చారిత్రక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. విద్యార్థుల మేధో సామర్థ్యాలను మెరుగుపరుస్తూనే వారిపై ఉన్న పరీక్షల భారాన్ని తగ్గించడమే మిగతా 3లో..

## మోదీ పాలనలో 93 పరీక్షల పేపర్ లీకులు

- 2 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందని విమర్శ
- మోదీ హయాంలో 93 పేపర్లు లీక్ అయ్యాయని వెల్లడి
- నీట్ రద్దు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట
- ఇన్ని లీకులు జరిగినా ఎవరూ రాజీనామా చేయలేదని ఆగ్రహం
- లీకులకు గుజరాత్, యూపీలే ప్రధాన కేంద్రాలని ఆరోపణ
- తెలంగాణ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా

03





## అనాథగా భద్రాద్రి

### పుష్కర కాలంగా ఆలయానికి పాలక మండలి లేదు

- రాజకీయ ఆధిపత్యం వల్లే నియామకాల నిలిపివేత
- రక్షణ లేక 800 ఎకరాల ఆలయ భూములు అన్యాక్రాంతం
- పర్యవేక్షణ లేక కుంటుపడుతున్న ఆలయ పనులు
- 2027 గోదావరి పుష్కరాల పనులపై భక్తుల భయం
- దక్షిణ అయోధ్య వైభవాన్ని పాలకులు పట్టించుకోవడం లేదు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

భక్త రామదాసు తన చెమటను ధారపోసి, అత్యంత భక్తిశ్రద్ధలతో 17వ శతాబ్దంలో నిర్మించిన పుణ్యక్షేత్రం భద్రాచలం నేడు పాలకుల అలసత్వానికి నిలువుటద్దంగా మారుతోంది. దక్షిణ అయోధ్యగా పిలవబడే ఈ దివ్యధామానికి సుమారు 14 ఏళ్లుగా పూర్తిస్థాయి పాలక మండలి లేకపోవడం ఆలయ సర్వతోముఖాభివృద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తోంది. స్వామివారి సేవలో తరించాలని భావించే భక్తులకు కనీస సౌకర్యాల కల్పనలోనూ వెనుకబాటుతనం కనిపిస్తోంది. ప్రస్తుత తరుణంలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడటంతో ఆలయ ప్రతిష్ట మసకబారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి రామయ్య వైభవాన్ని కాపాడాల్సిన మిగతా 3లో..

## రాష్ట్రంలో సర్..!

- ఓటర్ల సవరణ వల్లే ఓటమి అని మమతా బెనర్జీ ఆరోపణ
- 'సర్' దెబ్బకు ప్రాంతీయ పార్టీల ఆందోళన
- జూన్, జూలై నెలల్లో ఇంటింటికీ ఓటర్ల సర్వే
- అనర్హులైన, డూప్లికేట్ ఓటర్ల ఏరివేత
- ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు పార్టీల అప్రమత్తత
- ఈ సవరణ ఎన్నికల ఫలితాలను మారుస్తుందన్న ఆవేదన

03



పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలు దేశవ్యాప్త ప్రాంతీయ పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. దీదీ కోటను కూల్చిన ఆ 'సర్' మంత్రం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల ముంగిట నిలిచింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరిట సాగుతున్న ఈ ప్రక్రియ కేవలం సాంకేతిక వ్యవహారం మాత్రమే కాదని, రాజకీయ ఉనికిని శాసించే బ్రహ్మాస్త్రమని తేలిపోయింది.



ఛార్జిషీట్‌లో మాజీ మంత్రిని ప్రధాన నిందితుడిగా చేర్చారు

02

## కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు

### ఏసీబీ కోర్టు నుంచి కేటీఆర్‌కు నోటీసులు

- నిబంధనల అతిక్రమణతో నిధుల బదిలీపై ఆరోపణ
- జూలై 31న కోర్టుకు హాజరుకావాలని ఆదేశం
- అర్వింద్ కుమార్ సహా ఐదుగురిపై విచారణ
- విదేశీ సంస్థకు నిధుల చెల్లింపులపై ఏసీబీ చర్యలు


# సీతక్క శాఖలో అన్నీ అక్రమాలే

- స్త్రీనిధి అక్రమాలపై స్పందించాలని సీతక్కకు కవిత విన్నపం
- అవినీతికి కారకుడైన ఎండీపై చర్యలకు డిమాండ్
- దొడ్డిదారిన చైర్మన్ పదవికి ఎండీ ప్రయత్నం
- అక్రమార్కులకు సర్కార్ పెద్దల సహకారంపై విమర్శ
- నియామకాలు నిష్పక్షపాతంగా జరగాలని సూచన
- నిరుద్యోగులను కాదని అక్రమార్కులను కాపాడటంపై మండిపాటు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయ యవనికపై ఇప్పుడు 'స్త్రీనిధి' ప్రకంపనలు సృష్టిస్తోంది. మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాల్సిన ఈ సంస్థ ప్రస్తుతం అక్రమాల అడ్డాగా మారిందంటూ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విసిరిన విమర్శనాస్త్రాలు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి. మంత్రి సీతక్క నేతృత్వంలోని శాఖలో సాగుతున్న ఈ వ్యవహారాలపై కవిత 'ఎక్స్' వేదికగా ఘాటుగా స్పందించారు. ముఖ్యంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చుట్టూ తిరుగుతున్న వివాదాలు, ఆయన అనుసరిస్తున్న వ్యూహాలు ఇప్పుడు ప్రభుత్వానికి పెను సవాలుగా పరిణమించాయి. మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలవాల్సిన వ్యవస్థలో ఇలాంటి విచలనాలు చోటుచేసుకోవడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. అక్రమార్కుల పట్ల ఉదాసీనత వహిస్తే అసలు లక్ష్యం దెబ్బతింటుందని ఆమె హెచ్చరించారు. సంస్థ సర్వస్వం తానే అన్నట్లుగా వ్యవహరిస్తున్న సదరు ఎండీ, తన పదవీకాలం ముగియనున్న తరుణంలో మరో కొత్త ఎత్తుగడ వేయడం చర్చనీయాంశమైంది. ఈ నెల 23వ తేదీతో ఆయన పదవీకాలం పూర్తవుతున్నప్పటికీ, అధికారాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేరని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అందుకే దొడ్డిదారిన 'ఎక్స్ అఫీషియో ఛైర్మన్' అనే కొత్త హోదాను సృష్టించుకుని, సంస్థను తన గుప్పెట్లో ఉంచుకోవాలని చూస్తున్నట్లు సమాచారం. ఈ నెల 16వ తేదీన జరగబోయే స్త్రీనిధి ఉద్యోగుల సమావేశమే ఇందుకు వేదికగా మారుతోందని కవిత ఆరోపించారు. ప్రభుత్వంలోని కొందరు కీలక వ్యక్తుల అండదండలతోనే ఈ 'బ్యాక్ డోర్' ఎంట్రీకి పక్కా స్కెచ్ సిద్ధమైందన్న వార్తలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. గత కొన్నేళ్లుగా స్త్రీనిధిలో జరుగుతున్న ఆర్థిక లావాదేవీలు, నియామకాలపై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్వయం సహాయక సంఘాల మహిళల కష్టార్జితంతో ముడిపడి ఉన్న ఈ సంస్థలో పారదర్శకత లోపించిందన్నది ప్రధాన ఆరోపణ. దాదాపు వేల కోట్ల రూపాయల టర్నోవర్ కలిగిన ఈ వ్యవస్థలో ఒకే వ్యక్తి ఆధిపత్యం కొనసాగడం వల్ల జవాబుదారీతనం కరువైందని విశ్లేషకులు భావిస్తున్నారు. అక్రమాలకు కేంద్ర బిందువుగా మారిన సదరు అధికారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, తిరిగి ఆయనకు పట్టం కట్టడం వెనుక ఉన్న మతలబు ఏమిటని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రజాస్వామ్యబద్ధంగా సాగాల్సిన వ్యవస్థలో వ్యక్తుల ప్రయోజనాల కోసం నిబంధనలను తుంగలో తొక్కడం సరికాదన్న వాదన వినిపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనపై పెద్ద ఎత్తున హామీలు ఇచ్చింది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని, కొత్త వారికి అవకాశం కల్పించకుండా పాత అక్రమార్కులకే పదవులు కట్టబెడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. 60 ఏళ్లు దాటిన వారికి, పదవీ విరమణ చేసిన వారికి కీలక బాధ్యతలు అప్పగించడం వల్ల యువత ఆశలు అడియాశలవుతున్నాయి. స్త్రీనిధి వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలో అర్హులైన యువ నిపుణులకు అవకాశం ఇవ్వకుండా, వివాదాస్పద వ్యక్తులకు రెడ్ కార్పెట్ పరచడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని కవిత విమర్శించారు. నిరుద్యోగ గళం వినపడకుండా చేసేందుకే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి సీతక్క తన శాఖలో జరుగుతున్న ఈ పరిణామాలను గమనించాలని, తక్షణమే ప్రక్షాళన చర్యలు చేపట్టాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి. క్షేత్రస్థాయిలో మహిళల సాధికారత కోసం నిరంతరం శ్రమిస్తున్న సీతక్క, తన కళ్లముందే జరుగుతున్న ఈ అక్రమాలను అడ్డుకోకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ఎండీ స్థాయి అధికారి వ్యవస్థను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిసినా మౌనంగా ఉండటం సరికాదని హితవు పలుకుతున్నారు. అక్రమ నియామకాలు, పదవుల పంపకాల్లో జరుగుతున్న లోపాయికారీ ఒప్పందాలను బయటపెట్టి, దోషులను కఠినంగా శిక్షించాల్సిన బాధ్యత మంత్రిపై ఉందని కవిత గుర్తుచేశారు. లేనిపక్షంలో మహిళా లోకం నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో నేరుగా జోక్యం చేసుకోవాలని డిమాండ్లు పెరిగాయి. స్త్రీనిధిలో నియామకాలు పూర్తి పారదర్శకంగా, మెరిట్ ప్రాతిపదికన జరగాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కవిత సూచించారు. రాజకీయ పైరవీలకు తావులేకుండా, అర్హత గల అధికారులను నియమించడం ద్వారానే సంస్థకు పూర్వవైభవం వస్తుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న 'మార్పు' అంటే అక్రమార్కులకు కొమ్ముకాయడమేనా అని సోషల్ మీడియాలో నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. వ్యవస్థను గాడిలో పెట్టేందుకు పారదర్శకతతో కూడిన నియామక ప్రక్రియ చేపట్టడం ఇప్పుడు అత్యవసరం. ప్రతి రూపాయికి లెక్క చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉండేలా నిబంధనలు కఠినతరం చేయాలని కోరుతున్నారు. స్త్రీనిధి అనేది కేవలం ఒక ఆర్థిక సంస్థ మాత్రమే కాదు, తెలంగాణలోని లక్షలాది మంది మహిళల ఆశల వారధి. దీని ద్వారా సుమారు 10 లక్షల పైచిలుకు స్వయం సహాయక సంఘాలకు ప్రయోజనం చేకూరుతోంది. సుమారు 5,000 కోట్ల రూపాయలకు పైగా రుణాలు ఈ సంస్థ ద్వారా పంపిణీ అవుతున్నాయి. ఇంతటి భారీ నిధుల నిర్వహణ ఉన్న చోట నిఘా వైఫల్యం చెందడం ఆందోళనకరం. ఎండీ తన స్వప్రయోజనాల కోసం 16వ తేదీన నిర్వహించ తలపెట్టిన సమావేశంపై ప్రభుత్వం స్టే విధించాలని మహిళా సంఘాల నేతలు కోరుతున్నారు. 23వ తేదీ లోపు కొత్త కమిటీని నియమించి, వ్యవస్థను ప్రక్షాళన చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరికలు జారీ అవుతున్నాయి. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో 'దొడ్డిదారి పదవులు' అనే పదం వైరల్ అవుతోంది. అర్హత ఉన్నవారిని పక్కన పెట్టి, తమకు అనుకూలమైన వారిని కీలక పోస్టుల్లో కూర్చోబెట్టడం ప్రజాస్వామ్య విలువలకే గొడ్డలిపెట్టు. స్త్రీనిధి ఎండీ వ్యవహారం ఇప్పుడు ఒక 'కేస్ స్టడీ'లా మారింది. వ్యవస్థను గుప్పెట్లో పెట్టుకోవడం ద్వారా నిధుల మళ్లింపునకు పాల్పడుతున్నారనే సందేహాలు నివృత్తి కావాల్సి ఉంది. ప్రభుత్వం ఈ విషయంలో సానుకూలంగా స్పందించకపోతే, ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అక్రమార్కుల అండదండలతో సాగే పాలన ఎంతో కాలం సాగదని, ప్రజలు గమనిస్తున్నారని కవిత తన ట్వీట్‌లో పేర్కొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. సరికొత్త పాలన అందిస్తామని చెప్పిన కాంగ్రెస్, ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్న వారిని ప్రోత్సహించడం గమనార్హం. స్త్రీనిధి సంస్థలో నియామకాలకు సంబంధించి ఒక సమగ్ర విచారణ జరిపించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. గతంలో జరిగిన నియామకాల్లో కూడా భారీగా నగదు చేతులు మారిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 16వ తేదీ సమావేశంలో తీసుకోబోయే నిర్ణయాలు అత్యంత కీలకం కానున్నాయి. ఒకవేళ ఎండీని ఎక్స్ అఫీషియో ఛైర్మన్‌గా నియమిస్తే, అది ఉద్యోగ సంఘాల ఆగ్రహానికి కారణం కావచ్చు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వం, ఒక అధికారి ప్రయోజనాల కోసం పాకులాడటం శోచనీయం. ఈ వివాదం రానున్న రోజుల్లో మరెన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి. మొత్తానికి స్త్రీనిధి అక్రమాల అంశం మంత్రి సీతక్కకు పెద్ద పరీక్షగా మారింది. మహిళల పక్షపాతిగా పేరున్న ఆమె, తన శాఖలో జరుగుతున్న ఈ కుంభకోణాలపై ఏ విధంగా స్పందిస్తారనేది ఆసక్తికరంగా మారింది. నిరుద్యోగుల ఆవేదన, మహిళా సంఘాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. అక్రమార్కులను ఏరిపారేసి, వ్యవస్థను ప్రక్షాళన చేయడమే ఇప్పుడున్న ఏకైక మార్గం. కవిత చేసిన ఆరోపణలపై స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన బాధ్యత సర్కారుపై ఉంది. మహిళా శక్తిని తక్కువగా అంచనా వేయకుండా, వారి ఆర్థిక మూలాలకు రక్షణ కల్పించడమే ఉత్తమ పాలన. ఈ వివాదానికి ముగింపు పలకడం ద్వారానే ప్రభుత్వ ప్రతిష్ఠ నిలబడుతుంది. పారదర్శకతతో కూడిన నిర్ణయాలే ప్రజాస్వామ్యానికి బలం చేకూరుస్తాయి.



# కాన్వాయ్ తగ్గితే కడుపు నిండుతుందా?

మొదటి పేజీ తరువాయి

సామాన్యుడికి అందనంత దూరంలోకి వెళ్తున్నాయి. ధరల నియంత్రణ మండలిని ఏర్పాటు చేసి, దళారుల దోపిడీని అరికట్టాల్సిన పాలకులు అలంకారప్రాయమైన మార్పులతో కాలక్షేపం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కాన్వాయ్‌ను 9 నుండి 4 వాహనాలకు కుదించాలని ఆలోచించడం రాజకీయ వ్యూహంగా బాగున్నా, పరిపాలనలో దమ్ము చూపించాల్సిన సమయం ఇది. కేవలం వాహనాల తగ్గింపుతో ప్రభుత్వం తన బాధ్యత తీరిపోయిందని అనుకుంటే పొరపాటే. ప్రజలు ఎదుర్కొంటున్న ఇంధన సంక్షోభానికి శాశ్వత పరిష్కారాలు కావాలి. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తగ్గినప్పుడు ఆ ప్రయోజనాన్ని వినియోగదారులకు చేరవేయడంలో విఫలమవుతున్న పాలకులు, ఇప్పుడు పొదుపు మంత్రం జపించడం విడ్డూరం. దేశవ్యాప్తంగా పెట్రోల్ ధరల్లో ఏకరూపత ఉండేలా జీఎస్టీ పరిధిలోకి ఎందుకు తీసుకురావడం లేదనే నిలదీత ప్రజల నుండి వస్తోంది. అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ పన్నుల వేట సాగిస్తూనే ఉన్నారు. బంగారం కొనుగోళ్లు తగ్గించాలని ప్రధాని సూచించడం కూడా మధ్యతరగతి సెంటిమెంట్‌ను దెబ్బతీయడమే. భారతీయులకు బంగారం అనేది ఒక పెట్టుబడి, అత్యవసర కాలంలో ఆదుకునే ఆపద్బాంధవి. ధరల పెరుగుదలను అదుపు చేయలేక ప్రజలను కొనుగోళ్లు వద్దనడం బాధ్యతారాహిత్యం అవుతుంది. ద్రవ్యోల్బణం రేటు 6 శాతానికి పైగా నమోదవుతున్న తరుణంలో సామాన్యుడి పొదుపు మొత్తం క్రమంగా కరిగిపోతోంది. పాలకులు తమ ప్రసంగాల్లో ఆదర్శాలు చెబుతున్నా, ఆచరణలో మాత్రం ప్రజలపై పన్నుల భారం తగ్గించడం లేదు. విద్యుత్ ఛార్జీల పెంపు, రిజిస్ట్రేషన్ ఫీజుల అధిక ధరలు మధ్యతరగతి జీవి వెన్నువిరుస్తున్నాయి. ఈ క్రమంలో కాన్వాయ్ తగ్గింపు అనేది ఒక పొలిటికల్ జిమ్మిక్కులాగే మిగిలిపోయే ప్రమాదం ఉంది. గవర్నర్ శివప్రతాప్ శుక్లా లాంటి వారు కూడా కాన్వాయ్ కుదింపునకు మద్దతు తెలపడం ఒక సంకేతం మాత్రమే. అసలు సమస్య పాలనా వ్యవస్థలో పేరుకుపోయిన అనవసర ఖర్చుల గురించి ఎవరూ మాట్లాడటం లేదు. ఒక్కో ప్రజాప్రతినిధి విదేశీ పర్యటనలకు, ప్రచార కార్యక్రమాలకు వెచ్చించే కోట్లాది రూపాయలను తగ్గిస్తే చమురు పొదుపు కంటే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది. ప్రజల సొమ్ముతో విలాసవంతమైన భవనాలు, క్యాంపు కార్యాలయాలు నిర్మించుకుంటూ, కేవలం రోడ్డుపై వెళ్లే వాహనాల సంఖ్యను తగ్గించి పొదుపు చేస్తున్నామంటే ప్రజలు నమ్మే స్థితిలో లేరు. సామాన్యుడు లీటర్ పెట్రోల్ కొట్టించాలంటేనే వెయ్యి సార్లు ఆలోచిస్తున్నాడు. వాహనం లేనిదే బతుకు గడవని పరిస్థితి ఉన్న తరుణంలో ఇంధన ధరల నియంత్రణే ప్రభుత్వాల ప్రాధాన్యత కావాలి. నిజాయితీగా ఇంధన వాడకం తగ్గించాలనుకుంటే ప్రజా రవాణా మెరుగుపరిచి, ఎలక్ట్రిక్ వాహనాలకు భారీ రాయితీలు కల్పించాలి. ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్ల ధరలు మధ్యతరగతికి అందనంత దూరంలో ఉన్నాయి. ఛార్జింగ్ స్టేషన్ల సౌకర్యం లేదు. ఇలాంటి మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టకుండా కేవలం కాన్వాయ్‌లపై శ్రద్ధ చూపడం వల్ల ఒరిగేదేమీ లేదు. నిత్యావసర వస్తువుల ధరలు ప్రతి వారం 5 నుండి 10 శాతం మేర పెరుగుతూ పోతుంటే పేదవాడు పస్తులుండాల్సి వస్తోంది. ఉల్లిపాయల ధరలు పెరిగితేనే ప్రభుత్వాలు కూలిపోయిన చరిత్ర మన దేశానికి ఉంది. గ్యాస్ సిలిండర్ ధరలు సామాన్యుడిని కట్టెల పొయ్యి వైపు మళ్లిస్తున్నాయి. హోటల్ యజమానులు గ్యాస్ ధరల భారంతో ప్లేట్ భోజనం ధరను పెంచుకుంటూ పోతున్నారు. సామాన్యుడి ఆకలి తీర్చలేని ప్రభుత్వాలు, తమ వాహనాల సంఖ్యను మార్చుకుని గొప్పలు చెప్పుకోవడం అన్యాయం. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభానికి విరుగుడు కేవలం పాలకుల కాన్వాయ్ కోత మాత్రమే కాదు, వ్యవస్థాగత మార్పులు అవసరం.

# చివరి గింజ వరకు కొంటాం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ గడ్డపై పండిన ప్రతి వరి గింజనూ ప్రభుత్వం కచ్చితంగా కొనుగోలు చేస్తుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అత్యంత ధీమాగా ప్రకటించారు. రైతన్నలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మద్దతు ధర విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. గురువారం నల్లగొండ జిల్లాలో పర్యటించిన మంత్రి, సహచర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌లతో కలిసి క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారులతో ముచ్చటిస్తూ ప్రస్తుత సేకరణ తీరుతెన్నులను, మిల్లులకు ధాన్యం తరలింపు ప్రక్రియను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ దిశానిర్దేశం చేశారు. ధాన్యం సేకరణలో ఏమాత్రం జాప్యం జరగకుండా యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సేకరించిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించేలా రవాణా వ్యవస్థను పటిష్టం చేయాలని సూచించారు. ఇందుకోసం అవసరమైతే లారీల సంఖ్యను గణనీయంగా పెంచి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న 90 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యాన్ని చేరుకోవడానికి యంత్రాంగం నిరంతరం శ్రమించాలని ఆయన పిలుపునిచ్చారు. రైతుల ముంగిట ఉన్న సమస్యలను అక్కడికక్కడే అడిగి తెలుసుకుంటూ పరిష్కార మార్గాలను అన్వేషించారు. ప్రస్తుత రబీ సీజన్‌లో తెలంగాణ రాష్ట్రం వరి ఉత్పత్తిలో దేశంలోనే అగ్రగామిగా నిలవడం గర్వకారణమని ఉత్తమ్ కుమార్ రెడ్డి కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 65 లక్షల ఎకరాల్లో సాగు జరగగా, ఏకంగా 140 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రావడం విశేషం. ఈ అపారమైన పంటలో ప్రభుత్వం 90 లక్షల మెట్రిక్ టన్నులను సేకరించాలని నిర్ణయించింది. ఈ భారీ లక్ష్యం కోసం రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటి వరకు సుమారు 3.84 లక్షల మంది రైతుల నుంచి ధాన్యం సేకరించినట్లు మంత్రి గణాంకాలను వెల్లడించారు. ఆర్థిక చెల్లింపుల విషయంలో ప్రభుత్వం అత్యంత పారదర్శకతను పాటిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తి కాగా, రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 4,600 కోట్లు నేరుగా జమ అయ్యాయి. మరో రూ. 3,000 కోట్ల చెల్లింపుల ప్రక్రియ ప్రస్తుతం వివిధ దశల్లో వేగంగా కొనసాగుతోంది. రైతులకు ఆర్థిక ఇబ్బందులు కలగకుండా చూసుకోవడమే లక్ష్యమని ఆయన వివరించారు. టెక్నాలజీ సాయంతో నగదు బదిలీ ప్రక్రియను మరింత సరళతరం చేసినట్లు మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. నల్లగొండ జిల్లాలో ధాన్యం దిగుబడి రికార్డు స్థాయిలో 14.65 లక్షల మెట్రిక్ టన్నులుగా నమోదైంది. జిల్లా యంత్రాంగం ఇప్పటి వరకు 7.24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించింది. జిల్లాలోని 53,611 మంది అన్నదాతల ఖాతాల్లో ఇప్పటికే రూ. 692 కోట్లు జమ చేయడం విశేషం. మరో రెండు రోజుల్లో అదనంగా రూ. 400 కోట్లు జమ చేస్తామని మంత్రి రైతులకు తీపి కబురు అందించారు. జిల్లాలో కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగుతున్న తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూనే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మిల్లర్ల వైఖరిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. తరుగు, తాలు పేరుతో రైతులను వేధించే ప్రయత్నం చేస్తే సహించేది లేదని కరాఖండిగా చెప్పారు. నిబంధనలను అతిక్రమించి రైతులకు కష్టం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. పారదర్శకతతో కూడిన సేకరణ ప్రక్రియ వల్ల రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఈసారి దిగుబడి అనూహ్యంగా పెరిగిందని తెలిపారు. గతంతో పోలిస్తే 30 వేల మెట్రిక్ టన్నుల అదనపు పంట రావడం హర్షణీయమని పేర్కొన్నారు. రానున్న పది రోజుల్లోనే కొనుగోలు ప్రక్రియను సంపూర్ణంగా ముగించాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారు. లారీల కొరత లేకుండా చూసుకోవాలని, క్షేత్రస్థాయిలో రవాణా ఆటంకాలను తక్షణమే తొలగించాలని సూచించారు. రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కేలా ప్రతి అధికారి బాధ్యతగా పని చేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని కోమటిరెడ్డి పునరుద్ఘాటించారు. గతంలో నిర్మించిన శ్రీరామ్ సాగర్, నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి భారీ ప్రాజెక్టులే నేడు రాష్ట్రంలో పంటలు పచ్చగా ఉండటానికి కారణమని గుర్తు చేశారు. సాగునీటి సౌకర్యం కల్పించడం వల్లనే ధాన్యం సాగు గణనీయంగా పెరిగిందని విశ్లేషించారు. జిల్లాలోని ఏఎమ్మార్పీ కాలువల ఆధునికీకరణ పనుల కోసం రూ. 450 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు పూర్తయితే భవిష్యత్తులో సాగు దిగుబడులు మరిన్ని శిఖరాలను చేరుకుంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా ఇన్ చార్జ్ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయి సమస్యలను అధిగమిస్తున్న తీరును వివరించారు. హమాలీలు, రవాణా పరమైన అడ్డంకులను తొలగించి రైతుల వద్దకే వచ్చి ధాన్యం సేకరిస్తున్నామని చెప్పారు. రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, నిర్ణీత గడువులోగా చెల్లింపులు జరుగుతాయని హామీ ఇచ్చారు. ప్రతి గింజకూ మద్దతు ధర అందేలా చూడటమే తమ ప్రాధాన్యతని తెలిపారు. వ్యవస్థలోని లోపాలను సరిదిద్దుతూ రైతులకు మేలు చేసే విధంగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పకడ్బందీ చర్యలు అన్నదాతల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. మంత్రుల నేరుగా పర్యవేక్షణ, అధికారుల నిరంతర నిఘా వల్ల ధాన్యం సేకరణ ప్రక్రియ వేగం పుంజుకుంది. పండించిన పంటకు గిట్టుబాటు ధర లభిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు ఎదురైనప్పుడు తక్షణమే స్పందించే వ్యవస్థ అందుబాటులో ఉండటం శుభపరిణామం. రానున్న రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తితో సేకరణ పూర్తి చేసి రైతులకు అండగా నిలుస్తామని ప్రభుత్వం భరోసా ఇస్తోంది.



# కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ మహానగర ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసేందుకు గత ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫార్ములా ఈరేస్ వ్యవహారం ఇప్పుడు న్యాయస్థానం మెట్లెక్కింది. ఈ మెగా ఈవెంట్ నిర్వహణలో చోటుచేసుకున్నాయన్న ఆర్థిక అక్రమాలపై ఏసీబీ అధికారులు లోతైన దర్యాప్తు జరిపి సమర్పించిన నివేదికను ఏసీబీ ప్రత్యేక కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఈ నేపథ్యంలోనే భారత్ రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావుకు కోర్టు షాక్ ఇచ్చింది. ఆయనతో పాటు ఈ ప్రాజెక్టులో కీలక పాత్ర పోషించిన ఉన్నతాధికారులకు సైతం సమన్లు జారీ చేయడంతో ఒక్కసారిగా రాజకీయ సెగలు రాజుకున్నాయి. భాగ్యనగరం వేదికగా జరిగిన గ్రీన్ కార్ల వేట ఇప్పుడు లీగల్ చిక్కుల్లో పడటం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. తెలంగాణ మాజీ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలకు కూడా ఈ కేసులో గట్టి సెగ తగిలింది. ఏసీబీ దాఖలు చేసిన ఛార్జిషీటును క్షుణ్ణంగా పరిశీలించిన న్యాయస్థానం.. జులై 31వ తేదీన స్వయంగా విచారణకు హాజరుకావాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఈ వ్యవహారం వెనుక ఉన్న అసలు గుట్టును రట్టు చేసేందుకు దర్యాప్తు సంస్థలు గత కొన్ని నెలలుగా శ్రమిస్తున్నాయి. హైదరాబాద్ ముఖచిత్రాన్ని మార్చేస్తామని చెప్పిన ఈ రేసింగ్ లో రూల్స్ బ్రేక్ అయ్యాయని అధికారులు బలంగా విశ్వసిస్తున్నారు. కోర్టు ఆదేశాలతో ఒక్కసారిగా బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన మొదలవ్వగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ముందుకు సాగుతోంది. ఈ మొత్తం స్కామ్ లో ఏసీబీ అధికారులు ఐదుగురిని నిందితులుగా పేర్కొంటూ కీలక పత్రాలను సిద్ధం చేశారు. అందులో ఏ1 నిందితుడిగా మాజీ మంత్రి కేటీఆర్ పేరును చేర్చడం గమనార్హం. ఏ2గా అప్పటి పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ను, ఏ3గా మరో అధికారి బీఎల్ఎన్ రెడ్డిని చేర్చారు. అలాగే ఏ4 స్థానంలో కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు పేరు ఉండగా.. ఏ5గా నేరుగా ఎఫ్ఈవో అంటే ఫార్ములా ఈ ఆపరేషన్స్ సంస్థనే నిందితురాలిగా ఖరారు చేశారు. అధికార యంత్రాంగం, రాజకీయ నాయకత్వం కుమ్మక్కై నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారన్నది ప్రధాన ఆరోపణగా కనిపిస్తోంది. అసలు వివాదం 2023లో విదేశీ సంస్థకు జరిగిన భారీ నిధుల బదిలీ చుట్టూ తిరుగుతోంది. నిబంధనలను పక్కన పెట్టి హెచ్ఎండీఏ ఖజానా నుండి సుమారు రూ.55 కోట్లను ఒకేసారి ఎఫ్ఈవో సంస్థకు మళ్లించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇంత పెద్ద మొత్తాన్ని చెల్లించే క్రమంలో ఆర్థిక శాఖ అనుమతులు తీసుకోలేదని, కేబినెట్ ఆమోదం లేకుండానే నిధులు విడుదలయ్యాయని ఏసీబీ కోర్టుకు విన్నవించింది. ప్రభుత్వ ధనాన్ని ప్రైవేట్ సంస్థలకు ఇష్టారాజ్యంగా కట్టబెట్టడం తీవ్రమైన నేరమని దర్యాప్తు నివేదికలో పేర్కొన్నారు. రూ.55 కోట్ల నగదు ప్రవాహం విదేశీ ఖాతాల్లోకి వెళ్లిన తీరుపై ఇప్పటికే ఈడీ కూడా దృష్టి సారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. హైదరాబాద్ నగరం గ్లోబల్ మ్యాప్ పై వెలిగిపోవాలనే ఆకాంక్షతోనే తాము రేస్ నిర్వహించామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం గట్టిగా వాదిస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేందుకు ఈ ప్లాన్ వేశామని వారు సమర్థించుకుంటున్నారు. అయితే ఏసీబీ దర్యాప్తు మాత్రం వేరే కథ చెబుతోంది. నిధుల పంపిణీలో పారదర్శకత లోపించిందని, స్పాన్సర్ల నుండి రావలసిన డబ్బు రాలేదని అధికారుల వాదన. కేవలం ప్రచారం కోసం ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడం వెనుక పెద్ద కుట్రే ఉందని ప్రస్తుత ప్రభుత్వం ఆరోపిస్తోంది. రాష్ట్రంలో అధికారం మారిన వెంటనే ఈ ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కార్ ఫోకస్ పెట్టింది. ఫార్ములా రేస్ నిర్వహణలో జరిగిన లావాదేవీలన్నీ అనుమానాస్పదంగా ఉన్నాయని భావించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏసీబీ విచారణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒక విదేశీ సంస్థకు అంత పెద్ద మొత్తం కట్టబెట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని ముఖ్యమంత్రి స్వయంగా గతంలోనే ప్రశ్నించారు. ఈ క్రమంలోనే ఏసీబీ తన దర్యాప్తును వేగవంతం చేసి సాక్ష్యాలను సేకరించింది. అధికారుల స్టేట్మెంట్లు, బ్యాంకు లావాదేవీల వివరాలు ఇప్పుడు కేటీఆర్ కు ఇబ్బందికరంగా మారేలా ఉన్నాయి. హైదరాబాద్ ఫార్ములా ఈప్రిక్స్ అనేది దేశంలోనే మొదటి ఎలక్ట్రిక్ రేసింగ్ ఈవెంట్. దీనికోసం హుస్సేన్ సాగర్ చుట్టూ ఉన్న రోడ్లను సర్క్యూట్ గా మార్చి అత్యంత ఖరీదైన ఏర్పాట్లు చేశారు. ఆ సమయంలో రూ.వందల కోట్లు ఖర్చయ్యాయన్న అంచనాలు ఉన్నాయి. కేవలం ఒకే సీజన్ లో రూ.55 కోట్ల నగదును ఎఫ్ఈవోకు చెల్లించడం వెనుక ఉన్న అసలు ఉద్దేశాలపై విచారణ జరుగుతోంది. ఈ సొమ్ము చెల్లింపులో అధికారులపై రాజకీయ ఒత్తిడి ఏ మేరకు ఉందనే కోణంలో కూడా ఏసీబీ కూపీ లాగుతోంది. సామాన్య ప్రజల పన్నుల సొమ్మును రేసింగ్ కంపెనీలకు ధారాదత్తం చేశారన్నది ప్రధాన విమర్శ. జూలై 31న జరగబోయే కోర్టు విచారణ ఇప్పుడు అత్యంత కీలకమైంది. కేటీఆర్ వ్యక్తిగతంగా హాజరవుతారా లేక న్యాయవాదుల ద్వారా మినహాయింపు కోరుతారా అనేది చూడాలి. ఏసీబీ సమర్పించిన లిఖితపూర్వక ఆధారాలు బలంగా ఉంటే ఈ కేసు మరింత ముదిరే ప్రమాదం ఉంది. చట్టపరమైన చిక్కుల నుండి బయటపడేందుకు కేటీఆర్ బృందం ఇప్పటికే సీనియర్ న్యాయవాదులతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించి హెచ్ఎండీఏలోని కీలక ఫైళ్లను ఏసీబీ స్వాధీనం చేసుకుంది. అందులో ఉన్న సంతకాలు, నోట్ ఫైళ్లు ఎవరి మెడకు చుట్టుకుంటాయో అన్న ఉత్కంఠ నెలకొంది. రాజకీయంగా ఈ కేసు తీవ్ర దుమారం రేపుతోంది. బీఆర్ఎస్ అగ్రనేతలను టార్గెట్ చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం పాత ఫైళ్లను తవ్వుతోందని ఆ పార్టీ నేతలు మండిపడుతున్నారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే తప్పుడు కేసులు పెడుతున్నారని వారు విమర్శిస్తున్నారు. మరోవైపు, అవినీతికి వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని, అక్రమార్కులు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని పాలక పక్షం స్పష్టం చేస్తోంది. రూ.55 కోట్ల ప్రజాధనం ఎక్కడికి పోయిందో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేటీఆర్ పై ఉందని కాంగ్రెస్ శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి. మొత్తానికి హైదరాబాద్ గడ్డపై మెరిసిన ఫార్ములా ఈకార్ల వేగం కంటే కూడా ఇప్పుడు ఏసీబీ కేసు వేగమే ఎక్కువగా కనిపిస్తోంది. కోర్టు సమన్ల నేపథ్యంలో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయనేది ఉత్కంఠ కలిగిస్తోంది. ఐఏఎస్ అధికారుల ప్రమేయం ఉన్నందున ఈ కేసు బ్యూరోక్రసీలోనూ కలకలం రేపుతోంది. రూ.55 కోట్ల అక్రమ చెల్లింపుల ఆరోపణలు నిరూపితమైతే నిందితులు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. జూలై చివరలో జరిగే విచారణతో ఈ కేసులో ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. భాగ్యనగరం సాక్షిగా జరిగిన ఈ రేసింగ్ రాజకీయం ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

# అనాథగా 'భద్రాద్రి'

**మొదటిపేజీ తరువాయి**




బాధ్యతను విస్మరించడం వల్ల ఆధ్యాత్మికత కంటే రాజకీయాలే ఇక్కడ రాజ్యమేలుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందే ప్రారంభమైన ఈ దుస్థితి దశాబ్ద కాలం దాటినా ఇంకా కొనసాగుతుండటం గమనార్హం. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు కీలక మంత్రుల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలు, ఆధిపత్య పోరు కారణంగానే ట్రస్ట్ బోర్డు నియామకం జాప్యం జరుగుతోందని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. తమ అనుచరులకు చైర్మన్ పీఠాన్ని కట్టబెట్టాలనే పంతం వల్లనే ఫైళ్లు ముందుకు కదలడం లేదని తెలుస్తోంది. నాయకుల వ్యక్తిగత స్వార్థం క్షేత్ర ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా మారింది. ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం లేకపోవడం వల్లనే కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. దేవస్థానానికి సంబంధించిన దాదాపు 800 ఎకరాల భూములు రక్షణ లేక అక్రమార్కుల పాలు కావడాన్ని భక్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. 2012 నవంబర్ 25న 13వ పాలక మండలి గడువు ముగిసిన తర్వాత ఇప్పటివరకు కొత్త బోర్డు ఏర్పాటు కాకపోవడంతో భూముల అన్యాక్రాంతం యథేచ్ఛగా సాగుతోంది. ఏటా సుమారు రూ. 80 కోట్ల ఆదాయం ఆర్జిస్తున్న ఈ దేవాలయానికి సరైన రక్షణ వ్యవస్థ లేకపోవడం శోచనీయం. నిత్యం వేలాది మంది వచ్చే ఈ క్షేత్రంలో ఆస్తుల పర్యవేక్షణకు ప్రత్యేక విభాగం ఉన్నా, రాజకీయ అండదండలు ఉన్న అక్రమార్కుల ముందు అధికారులు నిస్సహాయులుగా మారుతున్నారు. పాలక మండలి లేని లోటు అధికారుల పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గతంలో భూ కబ్జాలను అడ్డుకోవడానికి ప్రయత్నించిన కార్యనిర్వహణాధికారి రమాదేవిపై జరిగిన భౌతిక దాడి ఇక్కడి గడ్డు పరిస్థితులకు నిదర్శనం. రాజకీయ ఒత్తిళ్లను తట్టుకోవడానికి, క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించడానికి ఒక శక్తివంతమైన బోర్డు ఉండటం అత్యవసరం. అధికారులు నియమ నిబంధనల ప్రకారం వెళ్లాలని చూసినా, స్థానిక ప్రభావిత శక్తులు అడ్డుపడుతుండటంతో పనులు ఎక్కడికక్కడే ఆగిపోతున్నాయి. ఒక బాధ్యతాయుతమైన పాలక మండలి ఉంటేనే యంత్రాంగం ధైర్యంగా నిర్ణయాలు తీసుకోగలదని భక్తులు అభిప్రాయపడుతున్నారు. ముంచుకొస్తున్న 2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో భద్రాచలం అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారింది. కోటి మందికి పైగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ప్రభుత్వం రూ. 586 కోట్లు కేటాయించి అందులో రూ. 351 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించింది. అయితే ఈ భారీ నిధులతో చేపట్టే పనుల నాణ్యతను తనిఖీ చేసే నాథుడే కరువయ్యారు. అధికారుల పర్యవేక్షణ నామమాత్రంగానే సాగుతోంది. పనులు సకాలంలో పూర్తి కావాలన్నా, భక్తుల రద్దీని తట్టుకునేలా వసతులు కల్పించాలన్నా తక్షణమే ట్రస్ట్ బోర్డును ప్రకటించాలి. లేనిపక్షంలో పుష్కర నిధులు దుర్వినియోగం అయ్యే ప్రమాదం పొంచి ఉంది. గత ప్రభుత్వం అనుసరించిన నిర్లక్ష్య వైఖరి వల్లనే భద్రాచలానికి ఈ దుస్థితి పట్టిందని కాంగ్రెస్ శ్రేణులు ఆరోపిస్తుండగా, ఇప్పుడు అధికారంలో ఉన్న వారు సైతం అదే బాటలో నడుస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వానికి ఇంకా రెండున్నరేళ్ల పదవీకాలం మాత్రమే మిగిలి ఉంది. పార్టీ కోసం ఏళ్ల తరబడి కష్టపడిన నాయకులు, కార్యకర్తలు పదవుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు నోటిఫికేషన్లు విడుదల చేసినా, నియామక ప్రక్రియ ముగింపు దశకు చేరుకోకపోవడంతో ఆశావహుల్లో నైరాశ్యం అలుముకుంది. అటు భక్తులకు ఇటు పార్టీ క్యాడర్ కు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన భద్రాచలం ఆలయానికి సంవత్సరానికి 50 లక్షల మందికి పైగా భక్తులు దర్శనం కోసం వస్తుంటారు. ఇక్కడ లభించే ఆదాయంతో పోలిస్తే వసతుల కల్పన అత్యంత హీనంగా ఉండటం బాధాకరం. యాత్రికులకు వసతి గదులు, మంచినీరు, క్యూ లైన్ల నిర్వహణ వంటి అంశాల్లో స్పష్టమైన ప్రణాళికలు లేవు. ఒక సమర్థవంతమైన పాలక మండలి ఉంటేనే ఇవన్నీ సాధ్యమవుతాయి. క్షేత్ర వైభవాన్ని పెంపొందించడం ద్వారా పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుంది. దానికి బదులు రాజకీయ కీచులాటలతో సమయం వృథా చేయడం భావ్యం కాదు. ట్రస్ట్ బోర్డు సభ్యులకు రాష్ట్ర స్థాయిలో లభించే గౌరవం, గుర్తింపు దృష్ట్యా దీనిపై తీవ్రమైన పోటీ ఉంది. ఈ గౌరవం కేవలం హోదాకే పరిమితం కాకుండా, రామయ్య సేవకు అంకితమయ్యేలా ఉండాలని భక్తులు కోరుతున్నారు. స్వార్థ ప్రయోజనాలు పక్కన పెట్టి, ఆలయ క్షేమాన్ని కాంక్షించే వారికి ఈ బాధ్యతలు అప్పగించాలి. ప్రస్తుతం నెలకొన్న అనిశ్చితి వల్ల దేవాలయ పరిపాలన అస్తవ్యస్తంగా తయారైంది. ప్రతి చిన్న విషయానికి ప్రభుత్వంపై ఆధారపడకుండా, స్థానికంగానే నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు బోర్డు వల్ల కలుగుతుంది. జిల్లా మంత్రులు తమ పంతాలను వీడి, ఉమ్మడి నిర్ణయంతో భద్రాద్రికి కొత్త జవసత్వాలు నింపాల్సిన సమయం ఆసన్నమైంది. రాజకీయ పోరాటాలు ఎన్నికల వరకే పరిమితం కావాలి, కానీ దైవ క్షేత్రాల విషయంలో అవి శాపంగా మారకూడదు. దక్షిణ అయోధ్యగా పిలవబడే ఈ పుణ్యభూమిని కాపాడుకోకపోతే చరిత్ర క్షమించదని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ ఆలయానికి పూర్తిస్థాయి పాలక మండలిని నియమించాలి. తద్వారా భక్తుల నమ్మకాన్ని గెలుచుకోవడంతో పాటు పుష్కరాలకు సిద్ధం కావడం సులభతరం అవుతుంది. ముగింపు దశలో ఉన్న పనులు, భూముల పరిరక్షణ, భక్తుల సౌకర్యాల విషయంలో ప్రభుత్వం తక్షణమే ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ ప్రకటించాలి. నిధుల కేటాయింపుతోనే బాధ్యత ముగిసిపోదు, వాటి వినియోగాన్ని పర్యవేక్షించే వ్యవస్థను బలోపేతం చేయాలి. భద్రాచలం ఆలయ అభివృద్ధి అనేది కేవలం ఒక ప్రాంతానికి సంబంధించిన విషయం కాదు, అది తెలుగు రాష్ట్రాల సాంస్కృతిక వారసత్వం. ఆ వారసత్వాన్ని కాపాడుకోవడంలో పాలకులు చిత్తశుద్ధిని ప్రదర్శించాలి. రాబోయే పుష్కరాల నాటికి భద్రాద్రిని ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్ది, రామదాసు కలలను సాకారం చేయాలని కోట్లాది మంది ఆకాంక్షిస్తున్నారు.

# చట్టం 'బండి' చుట్టమా..?

**మొదటిపేజీ తరువాయి**






అందుబాటులో లేకపోవడంతో భగీరథ్ మేనమామకు పత్రాలు అందజేసి వెనుదిరిగారు. విచిత్రమేమిటంటే అదే రోజు సాయంత్రం కరీంనగర్ నడిబొడ్డున కేంద్ర మంత్రి ఒక భారీ రోడ్ షో నిర్వహించి హల్చల్ చేశారు. చట్టాన్ని కాపాడాల్సిన వారే నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారనే విమర్శలు నెట్టింట విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. రోడ్ షోలో భాగంగా తన కుమారుడు అత్యంత నిర్దోషి అని, రాజకీయ కుట్రలో భాగంగానే ఇరికించారని మంత్రి ఉద్వేగపూరిత వ్యాఖ్యలు చేశారు. తన అర్ధాంగి ఈ పరిణామాల వల్ల తీవ్ర మనోవేదనకు లోనవుతోందని కన్నీటి పర్యంతమయ్యారు. చట్టం ముందు ఎవరైనా సమానమేనని, తన రక్తం తప్పు చేసినట్లు తేలితే కఠిన శిక్ష అనుభవించాల్సిందేనని బాహాటంగా ప్రకటించారు. కానీ ఈ నీతి సూక్తులు పలకడం కంటే తన కుమారుడిని నేరుగా ఖాకీలకు అప్పగించవచ్చు కదా అని జనం ప్రశ్నిస్తున్నారు. దేశ భద్రతను పర్యవేక్షించే కీలక హోదాలో ఉండి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం తగదని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ఆచరణలో చిత్తశుద్ధి చూపడం అత్యవసరం. ఖాతరు చేయని పోలీసుల తీరుపై మాజీ ఐపీఎస్ అధికారులు సైతం ధ్వజమెత్తుతున్నారు. పోక్సో లాంటి అరాచక కేసుల్లో నిందితులకు నోటీసులు ఇచ్చి సాదరంగా ఆహ్వానించడం రాజ్యాంగంలో ఎక్కడా లేదని గుర్తు చేస్తున్నారు. సాధారణంగా ఇటువంటి ఘోర నేరాల్లో నిందితులను తక్షణమే ఇనుప సంకెళ్లతో రిమాండ్‌కు తరలించడం ఆనవాయితీ. గతంలో ఇతర వర్గాల వ్యక్తులు ఇలాంటి కేసుల్లో చిక్కున్నప్పుడు మంత్రి చేసిన ఘాటు వ్యాఖ్యలు ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడు తన ఇంటికి వచ్చేసరికి నిబంధనలు చుట్టాలుగా మారడం పక్షపాత వైఖరికి నిదర్శనమనే అభిప్రాయాలు బలంగా వినిపిస్తున్నాయి. అధికారుల తీరుపై సోషల్ మీడియా వేదికగా విపరీతమైన ట్రోల్స్ కొనసాగుతున్నాయి. మరోపక్క బాధిత బాలికకు తక్షణమే న్యాయం చేయాలని కోరుతూ నిరసన జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధపడిన ప్రతిపక్ష నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేయడం చర్చనీయాంశమైంది. నిందితుడిని పట్టుకోవడంలో నత్తనడకన సాగుతున్న యంత్రాంగం, ప్రశ్నించే గొంతుకలను అణచివేయడంలో మాత్రం జెట్ వేగంతో స్పందిస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. కొందరు సామాజిక కార్యకర్తలు నిందితుడు ఎక్కడ దాక్కున్నాడో వేటాడి పట్టుకుంటామంటూ ముఖ్యమంత్రి నివాసం వైపు వెళ్లడం ఉద్రిక్తతకు దారితీసింది. డిజిటల్ మీడియా వేదికగా అసలు నిజాలు వెలుగులోకి రావడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పర్వం పెరిగింది. పోలీసులు విచారణలో మరిన్ని కఠినమైన సెక్షన్లను జోడించి తీవ్రత పెంచారు. బాధిత బాలిక వాంగ్మూలం నమోదు చేసిన తర్వాత గతంలో ఊహించిన దానికంటే ఎక్కువ హింస జరిగిందని గుర్తించి కొత్త సెక్షన్లు చేర్చారు. 2019లో జరిగిన చట్ట సవరణల ప్రకారం ఈ నేరం రుజువైతే 20 ఏళ్ల వరకు కటకటాల వెనుక ఉండాల్సి వస్తుంది. శిక్ష నుంచి తప్పించుకునేందుకు నిందితుడు ముందస్తు బెయిల్ కోసం హైకోర్టు గడప తొక్కడం విడ్డూరంగా అనిపిస్తోంది. ఒకవైపు బహిరంగంగా చట్టబద్ధత గురించి ప్రసంగాలు చేస్తూనే, మరోవైపు అజ్ఞాతంలో ఉంటూ న్యాయపరమైన రక్షణ కోరడం ద్వంద్వ నీతిని ప్రతిబింబిస్తోంది. సోషల్ మీడియాలో మిస్సింగ్ అనే హ్యాష్‌ట్యాగ్‌లు, పోస్టర్లు ఇప్పుడు తెగ వైరల్ అవుతూ ప్రస్తుత గందరగోళ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. నగరంలోని ప్రధాన కూడళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు నిందితుడి ఛాయాచిత్రాలతో పోస్టర్లు అతికించారు. వీటిని మున్సిపల్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన తొలగించడంపై సామాన్యులు మండిపడుతున్నారు. నిందితుడిని వేటాడాల్సిన యంత్రాంగం ఈ పోస్టర్లపై అభ్యంతరాలు తెలపడం వెనుక ఉన్న మర్మమేమిటని నిలదీస్తున్నారు. ప్రభుత్వం నిజంగానే నిందితుడిని కటకటాల వెనక్కి నెట్టాలని భావిస్తే ఇలాంటి వింత చర్యలు ఎందుకు తీసుకుంటున్నారని జనం చర్చించుకుంటున్నారు. మెట్రో రైళ్లలో కూడా ప్రయాణికులను ఆరా తీయగా సామాన్యులు తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. పెద్దల బిడ్డలకు ఒక న్యాయం, పేదవాడికి మరో న్యాయం ఉండటం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిణామాలు రాజ్యాంగ వ్యవస్థలపై ప్రజలకున్న గౌరవాన్ని సడలించేలా ఉన్నాయి. న్యాయం నాలుగు పాదాల మీద నడుస్తుందనే నానుడి కేవలం గ్రంథాలకే పరిమితమా అనే అనుమానం కలుగుతోంది. సామాన్యులు ఇలాంటి అకృత్యాలకు పాల్పడితే తక్షణమే గిరి గీసే యంత్రాంగం, పలుకుబడి ఉన్న వ్యక్తుల విషయంలో ఎందుకు వెనుకడుగు వేస్తోంది? ఈ ప్రశ్నలు పాలకులకు పెద్ద సవాలుగా పరిణమించాయి. ముఖ్యంగా హోం శాఖ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి ఈ క్రతువులో ఎంత పారదర్శకంగా ఉంటారనేది అందరూ నిశితంగా గమనిస్తున్నారు. రాజకీయ ప్రయోజనాల కంటే బాధితురాలికి సత్వర న్యాయం జరగడమే ప్రధాన లక్ష్యం కావాలి. నిష్పక్షపాతంగా విచారణ జరగకపోతే ప్రజాస్వామ్య విలువలకే ముప్పు వాటిల్లుతుంది. కేవలం నోటీసులు ఇవ్వడం, వారు గడువు కోరడం వంటి చర్యలు విచారణను నీరుగార్చే వ్యూహాలని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నెల 15వ తేదీన స్వయంగా హాజరవుతానని ఈమెయిల్ ద్వారా నిందితుడు సమాచారం పంపడం కూడా ఒక రకమైన ఎత్తుగడలా అనిపిస్తోంది. అన్ని రకాల పత్రాలు సిద్ధం చేసుకుని రావడం అంటే సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉంటుందని అనుమానాలు బలపడుతున్నాయి. పోలీసు వ్యవస్థ తన స్వతంత్రతను నిరూపించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. యావత్ రాష్ట్ర ప్రజానీకం ఈ నాటకీయ పరిణామాలపై ఒక కన్నేసి ఉంచారు. వ్యవస్థలు పటిష్టంగా ఉన్నప్పుడే సామాన్యుడికి భరోసా ఉంటుంది. అధికార బలంతో లేదా రాజకీయ అండదండలతో చట్టం నుంచి తప్పించుకోవాలని చూడటం సభ్య సమాజానికి గొడ్డలిపెట్టు. నిందితుడు ఎవరైనా సరే బాధితురాలికి జరిగిన అన్యాయానికి జవాబుదారీ కావాల్సిందే. ఈ మొత్తం వ్యవహారంలో ఖాకీలు చూపిస్తున్న ఉదాసీనత భవిష్యత్తులో అత్యంత ప్రమాదకరమైన సంకేతాలను పంపుతుంది. త్వరలోనే వాస్తవాలు నిగ్గు తేలుతాయని, బాధితురాలికి సముచిత న్యాయం దక్కుతుందని ఆశిద్దాం. ప్రజాస్వామ్యంలో ప్రజలే అసలైన నిర్ణేతలు. వారి నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత పాలకుల భుజస్కంధాలపై ఉంది. పారదర్శకమైన విచారణే ఈ సమస్యకు ఏకైక పరిష్కారం. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తేనే వ్యవస్థలపై గౌరవం పెరుగుతుంది.

# ఇంటర్ విద్యలో సరికొత్త అధ్యాయం

**మొదటిపేజీ తరువాయి**

లక్ష్యంగా బోర్డు ఈ సంచలన నిర్ణయాలను వెల్లడించింది. మే 11వ తేదీన విడుదల చేసిన ప్రవేశాల షెడ్యూల్ ప్రకారం మే 12 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ ఊపందుకుంది. నూతన విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి రానున్న ఈ మార్పులు అకడమిక్ రంగంలో సరికొత్త చర్చకు దారితీశాయి. విద్యార్థుల నైపుణ్యాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ఈ సంస్కరణలు దోహదపడతాయని విద్యావేత్తలు భావిస్తున్నారు. సైన్స్ సబ్జెక్టుల అభ్యసనలో విద్యార్థులకు ప్రయోగాత్మక పరిజ్ఞానం పెంచేందుకు బోర్డు ప్రాక్టికల్ పరీక్షల విధానాన్ని పూర్తిగా మార్చివేసింది. గతంలో కేవలం ద్వితీయ సంవత్సరంలోనే నిర్వహించే ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ ప్రాక్టికల్స్ ఇకపై ప్రథమ సంవత్సరంలో కూడా తప్పనిసరి కానున్నాయి. దీని వల్ల విద్యార్థులు మొదటి నుంచే ప్రయోగాలపై పట్టు సాధించే అవకాశం కలుగుతుంది. రెండు సంవత్సరాలకు కలిపి ప్రాక్టికల్స్ మార్కులను 30గా నిర్ణయించిన బోర్డు దానిని ఏడాదికి 15 మార్కుల చొప్పున విభజించింది. ఈ నిర్ణయంతో విద్యార్థులు చివరి నిమిషంలో ప్రాక్టికల్స్ కోసం పడే ఆందోళన తప్పుతుందని అధికారులు భావిస్తున్నారు. ప్రాక్టికల్స్ మార్కుల కేటాయింపులో వచ్చిన మార్పుల ప్రభావం థియరీ పరీక్షలపై కూడా పడింది. సైన్స్ విభాగంలోని నాలుగు ప్రధాన సబ్జెక్టుల థియరీ మార్కులను బోర్డు 60కి కుదించింది. ప్రయోగాత్మక విద్యకు పెద్దపీట వేయడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని విద్యా మండలి ఆశిస్తోంది. మార్కుల విభజనలో ఈ సమతుల్యత విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే క్రమంలో మేలు చేకూరుస్తుంది. పాఠ్యాంశాలను కేవలం కంఠస్థం చేయడమే కాకుండా వాటి వెనుక ఉన్న శాస్త్రీయతను అర్థం చేసుకునేలా ఈ విధానం ఉంటుంది. సైన్స్ విద్యార్థులు ప్రథమ సంవత్సరంలోనే ల్యాబ్ అనుభవాన్ని పొందడం విద్యా ప్రమాణాలను పెంచుతుంది. మానవీయ శాస్త్రాలు, భాషా సబ్జెక్టులలో కూడా బోర్డు కీలకమైన ఇంటర్నల్ అసెస్‌మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టింది. గణితంఏ, గణితంబీ సహా పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, జియోగ్రఫీ, హిస్టరీ వంటి సబ్జెక్టులలో 20 మార్కులకు యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ ప్రవేశపెట్టారు. దీనివల్ల గతంలో 100 మార్కులకు ఉన్న థియరీ పరీక్షలు ఇకపై 80 మార్కులకే పరిమితం కానున్నాయి. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, భాషలు, మోడ్రన్ లాంగ్వేజెస్ సబ్జెక్టులు కూడా ఈ కొత్త నిబంధన పరిధిలోకి వస్తాయి. నిరంతర సమగ్ర మూల్యాంకనం ద్వారా విద్యార్థుల ప్రగతిని అంచనా వేయడానికి ఈ విధానం ఎంతో తోడ్పడుతుంది. నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూనే విద్యార్థుల కోసం సరికొత్త గ్రూపులను బోర్డు అందుబాటులోకి తెచ్చింది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఏఈసీ (అకౌంటెన్సీ, కామర్స్, ఎకనామిక్స్) పేరుతో కొత్త కోర్సును ప్రారంభించనున్నారు. వాణిజ్య శాస్త్రంపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఇది ఒక గొప్ప వరమని చెప్పవచ్చు. ఎంఈసీ గ్రూపు విద్యార్థుల అవసరాలను గుర్తిస్తూ వారికి గణితంలో ప్రత్యేక ప్రశ్నపత్రాన్ని రూపొందించాలని బోర్డు నిర్ణయించింది. దీనివల్ల ఆయా గ్రూపుల విద్యార్థులు తమ కెరీర్ లక్ష్యాలకు అనుగుణంగా పాఠ్యాంశాలను సులభంగా చదువుకునే వీలు కలుగుతుంది. ఈ వైవిధ్యభరితమైన కోర్సులు ఇంటర్ విద్యను మరింత బలోపేతం చేస్తాయి. సబ్జెక్టు నిపుణుల కమిటీ పర్యవేక్షణలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పాఠ్య పుస్తకాలను బోర్డు పూర్తిగా పునరుద్ధరించింది. కేవలం సమాచారానికే పరిమితం కాకుండా విద్యార్థులను ఆలోచింపజేసేలా పుస్తకాల రూపకల్పన జరిగింది. ఆకర్షణీయమైన డయాగ్రామ్‌లతో పాటు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేలా నాలెడ్జ్ బాక్స్‌లను జోడించారు. డిజిటల్ లెర్నింగ్‌ను ప్రోత్సహిస్తూ ప్రతి పాఠం వద్ద క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేయడం విశేషం. ఇవి విద్యార్థులకు అదనపు వీడియో పాఠాలు, సమాచారాన్ని అందుబాటులోకి తెస్తాయి. నూతన జాతీయ విద్యా విధానం స్ఫూర్తితో ఈ మార్పులు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. భారతీయ విజ్ఞాన వ్యవస్థలకు పాఠ్యపుస్తకాల్లో సముచిత స్థానం కల్పించడం ద్వారా విద్యార్థులకు మన వారసత్వంపై అవగాహన కలుగుతుంది. క్లిష్టమైన సైన్స్ ప్రయోగాలను సులభంగా అర్థం చేసుకునేందుకు సిమ్యులేషన్‌లను పుస్తకాల్లో పొందుపరిచారు. ఆధునిక సాంకేతికతను విద్యా రంగంలోకి తీసుకురావడం ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెరుగుతుంది. పాఠ్య పుస్తకాల్లోని ప్రతి అంశం విద్యార్థికి ప్రాక్టికల్ నాలెడ్జ్ అందించేలా నిపుణులు జాగ్రత్తలు తీసుకున్నారు. నూతన పుస్తకాలు విద్యార్థుల్లో పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందిస్తాయని బోర్డు విశ్వసిస్తోంది. విజువల్ లెర్నింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా చదువుపై ఆసక్తి పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పుస్తకాల పంపిణీ పూర్తి చేయాలని బోర్డు లక్ష్యంగా పెట్టుకుంది. జూన్ 1వ తేదీలోపు రాష్ట్రంలోని విద్యార్థులందరికీ నూతన పాఠ్య పుస్తకాలు అందుబాటులోకి వస్తాయని ఇంటర్ బోర్డు సెక్రటరీ ధీమా వ్యక్తం చేశారు. గతం కంటే ముందుగానే ఈ ప్రక్రియను పూర్తి చేయడం వల్ల విద్యార్థులు విద్యా సంవత్సరం ఆరంభం నుంచే చదువుపై శ్రద్ధ పెట్టవచ్చు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల పంపిణీ జరుగుతుంది. ప్రైవేటు కాలేజీల విద్యార్థులు కూడా మార్కెట్లో ఈ పుస్తకాలను సకాలంలో పొందేలా ఏర్పాట్లు చేశారు.




# మోదీ పాలనలో 93 పరీక్షల పేపర్ లీకులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**




దేశవ్యాప్త విద్యా వ్యవస్థలో ప్రకంపనలు సృష్టిస్తున్న నీట్ యూజీ 2026 పేపర్ లీక్ ఉదంతం ఇప్పుడు రాజకీయ రణక్షేత్రంగా మారింది. కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి, అసమర్థ నిర్వహణ కారణంగా లక్షలాది మంది విద్యార్థుల కలలు కల్లలయ్యాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. గడిచిన పదేళ్ల కాలంలో మోదీ పాలనలో దేశవ్యాప్తంగా దాదాపు 93 పరీక్షల పేపర్లు లీక్ అవ్వడం గమనార్హం. ఈ పరిణామం విద్యా వ్యవస్థపై నమ్మకాన్ని సడలించేలా చేస్తోంది. అహర్నిశలు శ్రమించి చదువుకున్న నిరుద్యోగులు, విద్యార్థులు నేడు రోడ్లపైకి వచ్చి తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. కేంద్రం తీసుకున్న ఈ ఏకపక్ష నిర్ణయం దేశ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తోందని ముఖ్యమంత్రి తీవ్రంగా ఆక్షేపించారు. నీట్ పరీక్ష రద్దును రేవంత్ రెడ్డి గతంలో చేపట్టిన నోట్ల రద్దుతో పోల్చడం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. ఒక చిన్న పొరపాటును సరిదిద్దుకునే క్రమంలో కోట్లాది మంది సామాన్యుల జీవితాలతో ఆటలాడుకోవడం కేంద్రానికి అలవాటుగా మారిందని ఆయన ఎద్దేవా చేశారు. ఈ నిర్ణయం దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేయడమే కాకుండా, విద్యా రంగంలో నెలకొన్న అస్థిరతను బహిర్గతం చేస్తోంది. అనాలోచితంగా తీసుకునే ఇటువంటి అడుగులు యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాల వల్ల విద్యార్థుల్లో అనిశ్చితి, నిరాశ పెరిగిపోతున్నాయి. సంవత్సరాల తరబడి కష్టపడి, కంటిమీద కునుకు లేకుండా చదివిన దాదాపు రెండు కోట్ల మంది విద్యార్థులు నేడు అయోమయంలో ఉన్నారు. తమ బిడ్డల ఉన్నత చదువుల కోసం ఆస్తులు అమ్మి, అప్పులు చేసి కోచింగ్ సెంటర్లకు పంపిన తల్లిదండ్రుల ఆశలు ఒక్కసారిగా నీరుగారిపోయాయి. ఈ స్థాయిలో వైఫల్యం జరిగినా కేంద్ర విద్యాశాఖ మంత్రిపై కనీస చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు మౌనం వహించడం విద్యార్థుల పట్ల వారికున్న నిర్లక్ష్యాన్ని చాటి చెబుతోంది. ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం లోపించిందనడానికి ఇదే నిదర్శనమని ముఖ్యమంత్రి విమర్శించారు. 2019 నుంచి గణాంకాలను పరిశీలిస్తే 15 రాష్ట్రాల్లో కీలక నియామక పరీక్షల పేపర్లు అంగడి సరుకుగా మారాయి. ముఖ్యంగా బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలే ఈ పేపర్ లీకులకు అడ్డాగా మారడం కలకలం రేపుతోంది. ప్రధానమంత్రి సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో ఏకంగా 14 సార్లు పేపర్ లీకులు చోటుచేసుకోవడం విస్మయం కలిగిస్తోంది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో సైతం ఇదే తరహా కుంభకోణాలు పునరావృతమవుతున్నాయి. ఇన్ని సంఘటనలు జరిగినా వ్యవస్థలో మార్పు తీసుకురావడంలో కేంద్రం విఫలమైందని కాంగ్రెస్ విడుదల చేసిన "ది పేపర్ లీక్ డెకేడ్" శ్వేతపత్రం స్పష్టం చేస్తోంది. 2014లో మోదీ అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ప్రభుత్వ పరీక్షా విధానంలో పారదర్శకత లోపించింది. వ్యవస్థీకృత లోపాలు బయటపడుతున్నా దిద్దుబాటు చర్యలు శూన్యంగా కనిపిస్తున్నాయి. కేవలం ఎనిమిది వారాల వ్యవధిలోనే నాలుగు ప్రతిష్ఠాత్మక జాతీయ పరీక్షలు రద్దు కావడం విద్యా చరిత్రలో ఒక మాయని మచ్చ. 24 లక్షల మంది రాసిన నీట్ యూజీతో పాటు, 9 లక్షల మంది హాజరైన యూజీసీనెట్, సీఎస్ఐఆర్‌నెట్ వంటి పరీక్షలు రద్దు కావడంతో అభ్యర్థులు మానసిక క్షోభకు గురవుతున్నారు. ఈ విపత్కర పరిస్థితులు విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రాల్లో పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష కోసం సుమారు 48 లక్షల మంది అభ్యర్థులు హాజరుకాగా, అందులో 16 లక్షల మంది మహిళలు ఉండటం విశేషం. పరీక్ష జరిగిన కొన్ని రోజులకే పేపర్ లీక్ కారణంగా రద్దు కావడంతో ఆ అభ్యర్థుల శ్రమ బూడిదలో పోసిన పన్నీరైంది. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ చట్టాన్ని 2024 ఫిబ్రవరిలోనే ఆమోదించినట్లు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా, దాని అమలులో తీవ్ర జాప్యం చేస్తోంది. కుంభకోణాలు వెలుగులోకి వచ్చాక గానీ కేంద్రానికి ఆ చట్టంపై నోటిఫికేషన్ ఇవ్వాలనే ఆలోచన రాలేదంటే వారి పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రేవంత్ రెడ్డి నొక్కి చెప్పారు. నిరంతర పేపర్ లీకులతో దేశ యువత నైతిక స్థైర్యం దెబ్బతింటోంది. మేధో వలసలు పెరిగే ప్రమాదం కూడా పొంచి ఉంది. ప్రతిభావంతులకు అన్యాయం జరుగుతున్నప్పుడు చూస్తూ ఊరుకోవడం భావ్యం కాదని ఆయన హెచ్చరించారు. కేంద్రం తన మొండి వైఖరిని వీడి తక్షణమే బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఒక పక్క డిజిటల్ ఇండియా అని నినాదాలు ఇస్తూ, మరో పక్క పరీక్షల నిర్వహణలో ఇంతటి వైఫల్యాలు చెందడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా విద్యార్థులు, తల్లిదండ్రులకు రేవంత్ రెడ్డి భరోసా కల్పించారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో విద్యార్థులు ఎవరూ అధైర్యపడొద్దని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి విద్యార్థికి అండగా నిలుస్తుందని, వారి బంగారు భవిష్యత్తుకు భరోసా కల్పిస్తుందని స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో 'సర్'..!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బ తగలడంతో, మిగిలిన రాష్ట్రాల్లోని విపక్షాలు, ప్రాంతీయ శక్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. ఓట్ల తొలగింపు వెనుక ఏదో గూఢచర్యం దాగుందనే అనుమానాలు రాజకీయ వర్గాల్లో జోరుగా షికారు చేస్తున్నాయి. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ఓటమికి అసలు కారణం ఓట్ల కోత అని ఆ పార్టీ నేతలు గొంతు చించుకుంటున్నారు. దొడ్డిదారిలో బీజేపీ అధికార పీఠాన్ని కైవసం చేసుకునేందుకు ఈ మార్గాన్ని ఎంచుకుందని ఆమె పదేపదే ధ్వజమెత్తుతున్నారు. కమలనాథులు ఈ విమర్శలను తోసిపుచ్చినా, గ్రౌండ్ లెవల్‌లో జరుగుతున్న మార్పులు చూస్తుంటే ప్రాంతీయ పార్టీల భయం అకారణమేమీ కాదనిపిస్తోంది. ముఖ్యంగా బీజేపీని వ్యతిరేకించే జాతీయ పార్టీలు సైతం ఈ 'సర్' దెబ్బకు విలవిలలాడుతున్నాయి. ఓటరు లిస్టులో తమ అనుకూల వర్గాల పేర్లు మాయమవడం ఎన్నికల ఫలితాలను తలకిందులు చేస్తుందనే ఆందోళన వారిని నిద్రపోనివ్వడం లేదు. తెలుగు నేలపై ఈ ప్రక్రియ ఇప్పటికే రెండు దశలు పూర్తి చేసుకుంది. ఇప్పుడు మూడో విడతకు రంగం సిద్ధమైంది. జూన్ మాసంలో ఓటర్ల జాబితాల వడపోత కార్యక్రమం అత్యంత కీలకంగా మారనుంది. ఏపీలో జూన్ 15 నుంచి జూలై 14 వరకు, తెలంగాణలో జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. బూత్ లెవల్ ఆఫీసర్లు నేరుగా ప్రజల ఇళ్లకు వెళ్లి వాస్తవ పరిస్థితిని బేరీజు వేస్తారు. అక్కడ నివసించని వారు, చనిపోయిన వారు, డూప్లికేట్ ఓట్లు ఉన్న వారిని గుర్తించి ఏరిపారేయడమే ఈ మిషన్ ప్రధాన ఉద్దేశం. ఈ సర్వేలో ఒక వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉంటే కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. వేరే నియోజకవర్గంలో కానీ, పొరుగు రాష్ట్రంలో కానీ ఓటు ఉంటే ఇక్కడ తొలగిస్తారు. గతంలో బల్క్ ఓట్ల నమోదుతో పబ్బం గడుపుకున్న పార్టీలకు ఇది మింగుడు పడని అంశం. ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో వందల సంఖ్యలో దొంగ ఓట్లు ఉండే సంప్రదాయానికి ఈ తనిఖీలు చరమగీతం పాడుతాయనే భయం పొలిటికల్ సర్కిల్స్‌లో కనిపిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి కేంద్ర ఎన్నికల సంఘం చేస్తున్న ఈ ఆపరేషన్ చాలా పకడ్బందీగా సాగుతోంది. ఏపీలోని వైసీపీ, తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాయి. వామపక్షాలు సైతం తమ ఓటు బ్యాంకుకు గండి పడుతుందేమోనని ఆందోళన చెందుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తన చేతిలో ఉన్న అధికారంతో 'సర్'ను ఒక ఆయుధంగా వాడుకుంటోందని ఈ పార్టీలు అంతర్గతంగా మదనపడుతున్నాయి. బెంగాల్ తరహాలో ఇక్కడ కూడా ఫలితాలు తారుమారైతే తమ రాజకీయ భవిష్యత్తు అంధకారమవుతుందని నేతలు భావిస్తున్నారు. అందుకే క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని కేడర్‌కు దిశానిర్దేశం చేస్తున్నారు. నియోజకవర్గాల వారీగా పార్టీ యంత్రాంగం ఇప్పుడు డేటా సైంటిస్టుల అవతారం ఎత్తింది. గత ఎన్నికల్లో తమకు పడ్డ ఓట్లు, ఇప్పుడు జాబితాలో కనిపిస్తున్న పేర్ల మధ్య వ్యత్యాసాన్ని లెక్కగడుతున్నారు. ప్రతి గ్రామంలో తమ సానుభూతిపరుల పేర్లు గాలికి పోకుండా చూడాలని కార్యకర్తలకు హుకుం జారీ చేశారు. సర్వే సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలని, తప్పుడు సమాచారంతో ఓట్లు పోకుండా జాగ్రత్త పడాలని ప్రచారం చేస్తున్నారు. రాజకీయ చదరంగంలో ఓటరు జాబితాయే అసలైన యుద్ధభూమిగా మారింది. గణాంకాల పరంగా చూస్తే ఈ ప్రక్షాళన ప్రభావం ఊహాతీతం. గతంలో జరిగిన రెండు దశల్లో లక్షలాది ఓట్లను అనర్హమైనవిగా గుర్తించి తొలగించారు. మూడో దశలో దాదాపు 10 శాతం నుంచి 15 శాతం వరకు ఓట్లు గల్లంతయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ స్థాయిలో మార్పులు చోటుచేసుకుంటే గెలుపోటముల సమీకరణాలు పూర్తిగా మారిపోతాయి. స్వల్ప మెజారిటీతో గట్టెక్కే అభ్యర్థులకు ఇది మరణశాసనంగా పరిణమించే ప్రమాదం ఉంది. అందుకే ప్రతి ఓటును ప్రాణప్రదంగా కాపాడుకోవాలని పార్టీలు తపిస్తున్నాయి. కేంద్రం చేస్తున్న ఈ 'సర్' కసరత్తు పారదర్శకత కోసమని అధికారులు చెబుతున్నా, రాజకీయ రంగు మాత్రం పులుముకుంటూనే ఉంది. ఆధార్ అనుసంధానం వంటి ప్రక్రియలు తోడవ్వడంతో బోగస్ ఓట్ల ఆటలు సాగడం లేదు. సాఫ్ట్‌వేర్ సాయంతో ఒకే ఫోటోతో ఉన్న వేర్వేరు పేర్లను ఇట్టే పసిగడుతున్నారు. ఈ డిజిటల్ నిఘా నుంచి తప్పుకోవడం పాతకాలపు నాయకులకు కష్టతరంగా మారింది. టెక్నాలజీ అప్‌డేట్ కావడంతో రాజకీయ వ్యూహకర్తలు సైతం పాత పద్ధతులను వదిలి కొత్త దారుల కోసం వెతుకుతున్నారు. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. తెలంగాణ, ఏపీ సరిహద్దు జిల్లాల్లో వేలాది మందికి రెండు రాష్ట్రాల్లోనూ ఓట్లు ఉన్నాయి. మూడో దశ పరిశీలనలో వీరందరినీ గుర్తించి ఒకచోట తొలగించడం ఖాయంగా కనిపిస్తోంది. ఇది ఏ పార్టీకి లాభిస్తుందో, ఎవరికి నష్టం కలిగిస్తుందో అంచనా వేయడం కష్టంగా మారింది. వలస కార్మికులు, విద్యార్థుల ఓట్లు కూడా ఈసారి భారీగా ప్రభావితం కానున్నాయి. క్షేత్రస్థాయిలో వాస్తవాలు సేకరించడమే లక్ష్యంగా సాగే ఈ ప్రక్రియ పొలిటికల్ గ్రాఫ్‌ను మార్చేయనుంది. తుది జాబితా వెలువడిన తర్వాతే అసలు సిసలు రాజకీయ రణరంగం మొదలవుతుంది.



# బాటసింగారంలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ర్యాలీ

- తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశం నిర్వహణ
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు సకల సౌకర్యాలు – విద్యార్థుల చేరికలకు పిలుపు

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**



తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 11 నుండి 17 వరకు నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ర్యాలీతో పాటు తల్లి దండ్రులు-ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం) ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఎర్రవెల్లి గౌరీ శంకరాచారి ముఖ్య అతిథిగా హాజరుకాగా, ఉప సర్పంచ్ నార్ల కొండ వెంకటేష్ అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి ప్రతాప్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు టేకుల సంతోష్ ప్రసంగించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గౌరీశంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్యావంతులైన ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారని తెలిపారు. చదువుతో పాటు ఆటలు, పాటలు, సహపాఠ్య కార్యక్రమాలకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంతో పాటు రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్, పాలు, రాగి జావ అందించనున్నట్లు వివరించారు.అదేవిధంగా విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి కంప్యూటర్ విద్య అందిస్తున్నామని, గత విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యార్థులు మండల, జిల్లా స్థాయిల్లో క్రీడల్లో ప్రతిభ కనబరిచి, కొన్ని క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో కూడా పాల్గొన్నారని గుర్తుచేశారు. ఎస్ఎస్‌సీ-2026 ఫలితాల్లో పాఠశాల 98.55 శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. మొత్తం 69 మంది విద్యార్థుల్లో కేవలం ఒక్కరు మాత్రమే అనుత్తీర్ణులయ్యారని తెలిపారు. గ్రామంలోని బడిఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యతో పాటు మంచి సంస్కారం కూడా నేర్పిస్తారని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డ్ సభ్యులు గడ్డం రమేష్ గౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యురాలు జ్యోతి, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు డి. సత్తయ్య, పార్వతమ్మ, సబిత, లలిత, మంగమ్మ, లక్ష్మమ్మ, వనజ తదితరులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.ఈ విషయాన్ని బాటసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి ప్రతాప్ తెలిపారు.

## జయశంకర్ బడిబాట కార్యక్రమాలో ఎస్ఐ




**విశాలభారతి:** గూడూరు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల నుండి గూడూరు సెంటర్ వరకు మండల విద్యాశాఖ అధికారి సుజాత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించబడింది. ఈ ర్యాలీలో . గూడూరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్ శ్రీరాముడు హరి శంకర్ , శ్రీనివాస్ , సంధ్యారాణి, యాకలక్ష్మి, సులోచన, జయశ్రీ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు మరియు విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అధిక సంఖ్యలో విద్యార్థులను చేర్పించాలని ఎంఈఓ అడవు సుజాత తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య లభిస్తుందని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని సత్యనారాయణ తెలిపారు.

## నీలారపు వేణును సన్మానించిన బిఆర్ఎస్ శ్రేణులు



**దేవరుప్పుల విశాలభారతి:** హైకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో పీఏసీఎస్ పాత పాలక వర్గాల పునరుద్ధరణ జరిగిన నేపథ్యంలో దేవరుప్పుల మండలకేంద్ర పిఎసిఎస్ డైరెక్టర్ గా నీలారపు వేణు యాదవ్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్,మండల నాయకులు ఏల సుందర్,కారుపోతుల బిక్షపతి గౌడ్,జోగు సోమనర్సయ్య,నర్రా సోమసుందర్, గొడిశాల మల్లేష్,ఉప్పుల సామ్రాట్ ,పల్సం నర్సింహ,తదితరులు పాల్గొన్నారు.

## గొల్ల కురుమల అభ్యున్నతికి సరిత తిరుపతయ్య సేవలు అందించాలి: బుగ్గ నవీన్



**ఆలేరు, విశాల భారతి:** తెలంగాణ గొర్రెల మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన శ్రీమతి సరిత తిరుపతయ్యను ఆలేరు కాంగ్రెస్ మండల నాయకులు బుగ్గ నవీన్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బుగ్గ నవీన్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో గొల్ల కురుమ సమాజానికి సముచిత గౌరవం కల్పిస్తూ గొర్రెల మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ పదవిని సరిత తిరుపతయ్యకు అప్పగించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సరిత తిరుపతయ్య గొల్ల కురుమల సమస్యల పరిష్కారానికి కృషి చేసి, గొర్రెలు-మేకల పెంపకందారుల సంక్షేమం కోసం మరింత సేవ చేయాలని నవీన్ ఆకాంక్షించారు.

## వడ్డెర కుల కార్పొరేషన్ చైర్మన్ ను తక్షణమే మార్చాలి

- కార్పొరేషన్ చైర్మన్ గుంజ రేణుకను ప్రకటించడం సరికాదు
- ఆ చైర్మన్ మాకొద్దు, వడ్డెర కుల సంఘాల అసంతృప్తి




**బూర్గంపాడు, విశాలభారతి:** బూర్గంపాడు మండల కేంద్రం సారపాకలో తెలంగాణ వడ్డెర కుల సంఘ చారిటబుల్ ట్రస్ట్ శివరాత్రి అయిలమల్లు ఆదేశాల మేరకు గురువారం నాడు మన భద్రాద్రి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వెల్ఫేర్ సొసైటీ నందు తెలంగాణ వడ్డెర కుల సంఘ చారిటబుల్ ట్రస్ట్ జిల్లా కార్యదర్శి గుర్రం శ్రీనివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డెరకుల కార్పొరేషన్ చైర్మన్ ఏర్పాటు చేయడం, నిధులు కేటాయించడం సంతోషం. కానీ ఎటువంటి అవగాహన లేని గుంజ రేణుకను ప్రకటించడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. గుంజ రేణుకను చైర్మన్ గా ప్రకటించడం అంటే వడ్డెర కులానికి అన్యాయం చేసినట్టే అని వాపోయారు. గతంలో దేవరకొండ కాన్స్టెన్సీ జడ్పిటిసిగా ఎన్నికైన రేణుక వడ్డెర కులానికి చేసిన అభివృద్ధి శూన్యం అని వ్యాఖ్యానించారు. వడ్డెర కులం స్థితిగతులు తెలియని వారిని నియమించటం తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమంజసం కాదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. గుంజ రేణుకను వడ్డెర కుల కార్పొరేషన్ చైర్మన్ గా ప్రకటించడం అంటే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 16 లక్షల వడ్డెర కులజనాభా భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడమే అని అన్నారు. వడ్డెర కుల కార్పొరేషన్ చైర్మన్ పదవి విషయంలో పునరాలోచన చేసి సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఓర్సు సైదులు, రాష్ట్ర కోశాధికారి గుర్రం శ్రీనివాస్ తదితర వడ్డెర కుల సంఘ నాయకులు అధిక సంఖ్యలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఎర్రబెల్లి



**దేవరుప్పుల విశాలభారతి:** మండలం,చౌడురు గ్రామానికి చెందిన మేకల పెద్దాపురం ఇటీవలే అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకొని నేడు వారి నివాసానికి చేరుకుని వారి చిత్రపటానికి పూలుచల్లి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. వారి వెంట మండల బిఆర్ఎస్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలున్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించి ఎర్రబెల్లి



**దేవరుప్పుల విశాలభారతి:** మండలం,అప్పిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కాటూరి రూపయ్య కుమారుడి వివాహా విందు కార్యక్రమానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాం రెడ్డి,మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేశం,మాజీ ఎంపీపీ కొల్లూరి సోమన్న,మండల ప్రధాన కార్యదర్శి చింత రవి,మండల నాయకుడు ఏల సుందర్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు,యువజన నాయకులు,కార్యకర్తలు తదితరులున్నారు.

## సింగరాజుపల్లిలో బడిబాట ర్యాలీ



**దేవరుప్పుల విశాలభారతి:** విద్యా వారోత్సవాల్లో భాగంగా సింగరాజుపల్లి గ్రామంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. హరిజన కాలనీ ప్రాథమిక, మరియు ఉన్నత పాఠశాల, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుచిత్ర ఆనంద్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రైవేటు పాఠశాలలపై మోజు పడకుండా పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, కోరారు ప్రధానోపాధ్యాయులు బాస్కుల అంజయ్య, మాధవి ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య పుస్తకాలు యూనిఫామ్, పోషకాహారాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం పెండింగ్ టీచర్లు సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండ ఊర్మిళ మల్లారెడ్డి, ఉపసర్పంచ్ జోగు అనిల్ , ఉపాధ్యాయులు, నిరంజని, శారద, శ్రీదేవి, సునీత, పి ఎల్లయ్య రంజిత్ రావు, దిలీప్ కుమార్, కొంగరి సునీత, అంగన్వాడి ఉపాధ్యాయులు కొమ్ము మంగ, మరియు రాపాక శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నాయకులకు చట్టాలు చుట్టమా

- బండి సంజయ్ తనయుడిని ఎందుకు అరెస్టు చేయలేదు
- మైనర్ బాలికపై అత్యాచారం అత్యంత దుర్మార్గం
- ఫోక్సో కేసు నమోదు చేసి జైలుకు పంపాలి
- నిర్లక్ష్యం చేస్తే మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదు
- ఎండి ముంతాజ్ బేగం

**భద్రాచలం , విశాలభారతి:**



స్థానిక రాజుపేట కాలనీలో జరిగిన సమావేశంలో ఉద్యమ నాయకులు ఎండి ముంతాజ్ బేగం పాల్గొని మాట్లాడుతూ బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ మైనర్ బాలికపై చేసిన అత్యాచారం సహించరానిదని తక్షణమే అరెస్టు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మైనర్ బాలికపై అత్యాచారం చేసి రోజులు గడుస్తున్న ఇప్పటిదాకా అరెస్టు చేయక పోవటం బిజెపి ప్రభుత్వం మహిళల పట్ల ఏ రకమైన చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని ఆమె పేర్కొన్నారు. బిజెపి మంత్రులకు ఒక న్యాయం సామాన్యులకు ఒక న్యాయమా అని ఆమె నిలదీశారు. మైనర్ బాలిక పైన అత్యాచారం చేసి రోజులు గడుస్తున్న బిజెపి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తీవ్ర అభ్యంతరం వ్యక్త పరుస్తున్నామని అత్యంత దుర్మార్గమని ఆమె అన్నారు. ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం భగీరథ పై ఫోక్సో కేసు నమోదు చేసి జైలుకు పంపాలని లేనిపక్షంలో మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్



గిడ్డంగుల వద్ద ఆన్ లోడింగ్ ప్రక్రియ పరిశీలన

**నిజామాబాద్, విశాలభారతి:**

మోపాల్ మండలం శ్రీరాంనగర్ తండాలో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం తనిఖీ చేశారు. నిజామాబాద్ రూరల్ మండలం శ్రీనగర్ శివారులోని గోడౌన్ ను సైతం కలెక్టర్ సందర్శించారు. ముందుగా కొనుగోలు కేంద్రంను తనిఖీ చేసి, రైతులకు అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. మొక్కజొన్న పంట నాణ్యత, తేమ శాతంను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్ ద్వారా తూకం సరిగా చేస్తున్నారా లేదా అన్నది గమనించారు. ఇప్పటివరకు ఎన్ని క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు పూర్తయ్యింది, ఇంకా ఎంత పరిమాణంలో పంట సేకరణ జరగవలసి ఉన్నదని తదితర వివరాలు అడిగి తెలుసుకుని, అధికారులకు సూచనలు చేశారు. రైతులు పంట ఉత్పత్తులు కేంద్రానికి తెచ్చిన వెంటనే నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉంటే వెంటనే తూకం వేయించాలన్నారు. సేకరించిన పంటను వెంట వెంటనే గోడౌన్లకు తరలించాలని ఆదేశించారు. అకాల వర్షాలు కురిస్తే ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉన్నందున త్వరితగతిన మొక్కజొన్న నిల్వలను గోడౌన్లకు తరలించి జాగ్రత్తగా భద్రపరచాలని ఆదేశించారు. అవసరమైన సంఖ్యలో హమాలీలను సమకూర్చుకుని, మొక్కజొన్న రవాణాలో జాప్యానికి తావులేకుండా సరిపడా లారీలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. రైతులకు నిర్దిష్ట గడువు లోపు బిల్లుల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులకు ఏ దశలోనూ అసౌకర్యం కలగకుండా చూడటం అధికారుల బాధ్యత అని అన్నారు. అనంతరం శ్రీనగర్ లోని గోడౌన్ ను కలెక్టర్ సందర్శించారు. మొక్కజొన్న నిల్వల ఆన్ లోడింగ్ తీరును, మొక్కజొన్న బస్తాలను భద్రపరుస్తున్న విధానాన్ని పరిశీలించారు. గోడౌన్ లో పూర్తి సామర్థ్యం మేరకు పంటను నిల్వ చేయాలని, పంటకు ఎలాంటి నష్టం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉన్న స్టాక్‌ను త్వరితగతిన తరలించేందుకు తగినన్ని లారీలు, ఇతర రవాణా వాహనాలను వెంటనే ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను, ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్ ను ఆదేశించారు. పూర్తి పారదర్శకంగా, వేగవంతంగా కొనుగోళ్లను పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రేఖా నాయక్, ఎంపీడీఓ నరేష్, మార్క్ ఫెడ్ సిబ్బంది భాస్కర్ ఉన్నారు.

## బండరావిరాల ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా 'బడి బాట' కార్యక్రమం

- ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం – విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నాం
- పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బండరావిరాల గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మరియు మండల పరిషత్ ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు కలిసి గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి బాలబాలికను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.



అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. సర్కారు బడుల్లో విద్యార్థులకు 21 రకాల వస్తువులతో కూడిన స్కూల్ కిట్‌ను ఈ విద్యాసంవత్సరం నుంచి అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫార్మ్స్, షూస్, సాక్సులు, బెల్ట్, టై తదితర వస్తువులు ఉంటాయని వివరించారు.అలాగే విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని, నిపుణులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్య బోధిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగానే విద్యను ప్రధాన అజెండాగా తీసుకుని ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పదవి చేపట్టిన నాటి నుంచి పాఠశాలలో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు, మౌలిక వసతుల అభివృద్ధికి అనేక మార్పులు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించడం వల్ల గ్రామ ప్రజలకు ఆర్థిక భారం తగ్గుతుందని, పిల్లలకు బస్సు ప్రయాణం తగ్గడంతో సమయం ఆదా అవుతుందని చెప్పారు. దీంతో విద్యార్థులు మానసికంగా స్థిరంగా ఉండి విద్యపై మరింత దృష్టి సారించగలరని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు.ఈ సందర్భంగా పదో తరగతి ఫలితాల్లో పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను సర్పంచ్ అభినందించారు. పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించే దిశగా శ్రీ గుండోజు రంగదాసు ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందజేశారు. 531 మార్కులు సాధించిన కందికంటి ద్రాక్షవల్లి, 515 మార్కులు సాధించిన కళ్లెం అనుష్క గౌడ్‌లకు ట్రస్టు తరపున తలా రూ.5,000 నగదు బహుమతిని సర్పంచ్ చేతుల మీదుగా అందజేశారు.

## ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేత



**తిరుమలగిరి, విశాలభారతి :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పాలక మండళ్ళను నియమించడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం తిరుమలగిరి మండల ఎమ్మార్వో కు తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తీపిరాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో వినితిపత్రం అందజేయడం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి మాట్లాడుతూ మే 14, 15 తేదీలలో నిరసన కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం(ఏ ఐ కె ఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని అన్నారు. రాష్ట్ర క్యాబినెట్ ఏప్రిల్ 23, 2026 న తీసుకున్న నిర్ణయం ప్రకారం 908 సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పాలకమండళ్ళను నియమించాలని నిర్ణయం తీసుకుంది .దీని ప్రకారం ప్రతి సహకార సంఘం లో 13 మంది సభ్యుల పేర్లను పాలక పార్టీ కాంగ్రెస్ పార్టీ వ్యక్తులను అధ్యక్ష, డైరెక్టర్ పదవులో నామినేట్ చేసుకోవడానికి అన్ని ప్రాంతాల నుండి పేర్లను సేకరించింది. ఇది రాజ్యాంగ విరుద్ధం .నామినేట్ వ్యవస్థకు పూర్తిస్థాయి చట్టబద్ధత లేదన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 ZH ప్రాథమిక సహకార సంఘాలకు ఎన్నికలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక సహకార సంఘాల కు ఎన్నికలు జరిపి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎల్లంల యాదగిరి, జంపాల మల్లయ్య, ఎస్ డి ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బండి సాయి భగీరథ్ ను వెంటనే అరెస్ట్ చేయాలి

**బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోళ్లపూడి ప్రవీణ్ కుమార్**



**పాల్వంచ :విశాలభారతి:** మైనర్ బాలికపై లైంగిక వేధింపులు మరియు అత్యాచారయత్నానికి పాల్పడిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరద్ ను తక్షణమే అరెస్ట్ చేయాలి అని బహుజన్ సమాజ్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది. రాష్ట్రఅధ్యక్షులు ఇబ్రాం శేఖర్ ఆదేశాలమేరకు గురువారం పాల్వంచ పట్టణంలో రాజ్యాంగ నిర్మాత ఈ దేశ బహుజనుల ఆత్మగౌరవ చిహ్నం బాబాసాహెబ్ అంబేడ్కర్ గారి విగ్రహం దగ్గర నిరసన వ్యక్తం జరిగింది. అనంతరం జరిగిన పార్టీ సమావేశం లో జిల్లా అధ్యక్షులు కోళ్లపూడి ప్రవీణ్ కుమార్ మరియు జిల్లా ఉపాధ్యక్షులు యాసం సిద్దార్థ పూలే సంయుక్తం గా మాట్లాడుతూ బండి సాయి భగీరథ్ పై పొక్సో కేసు నమోదు అయి వారం కావొస్తున్నప్పటికీ నేటివరకు అరెస్ట్ చేయకపోవడం చాలా బాధాకరం. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీ కేంద్ర మంత్రి బండి సంజయ్ కి బయపడి బాధిత కుటుంబానికి అన్యాయం చేస్తున్నారు. ఈ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి కట్టుబడి ఉంది అని చెప్పే మాటలు అన్ని అబద్ధాలు అని అన్నారు.ఈ ప్రభుత్వంలో చట్టాలు ఉన్నతమైన వర్గాల వారికీ కొమ్ముకాస్తు పేద సామాన్య ప్రజలకు ఒకరకంగా అమలు చేస్తున్నారు అని విమర్శించారు.అందువల్లనే ఇప్పటివరకు బండి భగీరథును అరెస్టు చేయలేదు అని ఎద్దేవా చేశారు ఇప్పటికైనా తక్షణమే ఈ ప్రభుత్వం బండి భగీరద్ ని అరెస్టు చేయాలి, లేనిపక్షంలో అరెస్ట్ చేసే అంతవరకు బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం నియోజకవర్గ అధ్యక్షులు మంతెన రవి, జిల్లా కార్యదర్శి అబ్దుల్ హామీద్, నియోజకవర్గ కోశాధికారి పసుపులేటి రామ్ చందర్, పాల్వంచ పట్టణ అధ్యక్షులు కాల్వ ప్రవీణ్,ఎండి ఖాజా, జంగం లోకేష్ తదితరులు లు పాల్గొన్నారు

## మణుగూరు కోర్టు ఆవరణలో న్యాయ చైతన్య సదస్సు

**మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టాలపై అవగాహన.. పాల్గొన్న మెజిస్ట్రేట్ సూరి రెడ్డి**





**విశాలభారతి, మణుగూరు :** మండల లీగల్ ఎయిడ్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం మణుగూరు కోర్ట్ ఆవరణలో న్యాయ చైతన్య సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల లీగల్ అథారిటీ చైర్మన్, ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, వాణిజ్య దోపిడీ నిరోధక పథకం 2015 కింద బాధితులకు అందే న్యాయ సహాయం, రక్షణ చర్యలు, ప్రభుత్వ పునరావాస అవకాశాలను వివరించారు. అలాగే జాగృతి పథకం2025లో భాగంగా సురక్షిత్ బచ్‌పన్ - సురక్షిత్ భవిష్య కార్యక్రమం ద్వారా చిన్నారుల రక్షణ, పోక్సో చట్టం నిబంధనలు, బాలల హక్కుల పరిరక్షణపై కక్షిదారులకు అవగాహన కల్పించారు. లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాది వీరంకి పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో పలువురు న్యాయవాదులు వివిధ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురు కృష్ణ, న్యాయవాదులు కందిమల్ల నరసింహారావు, జాడి చొక్కారావు, కుర్మ విజయ్, మేదరమెట్ల శ్రీనివాసరావు, రామ్మోహన్ రావు, ఈర్ల రాము, పోశం భాస్కర్, బిక్కసాని శ్రీనివాస్, బొంతు సునీత, తాటి వందన, వాసవి, లీగల్ సెల్ కోఆర్డినేటర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు. సదస్సు ముగింపులో ప్రజలు తమ హక్కుల పరిరక్షణకు చట్టాలను తెలుసుకుని అవసరమైనప్పుడు లీగల్ ఎయిడ్ సేవలను వినియోగించుకోవాలని లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పద్మావతి సూచించారు.


## జలమండలి అధికారులను కలిసిన కొత్త రవి గౌడ్



**బోడుప్పల్ విశాలభారతి:** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ చెంగిచెర్ల డివిజన్లో మంచి నీటి సమస్య ఉందని డివిజన్ పరిధిలోని పలు కాలనీల ప్రజలు మాజీ డిప్యూటీ మేయర్ సీనియర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు చెంగిచెర్ల గ్రామ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ కొత్త రవి గౌడ్ దృష్టికి తీసుకు రావడంతో డివిజన్ నాయకులు,పలు కాలనీల బాధితులతో కలిసి చెంగిచెర్ల జలమండలి కార్యాలయంలో అధికారులను కలసి డివిజన్లో మంచి నీరు సమస్య అధికంగా ఉన్నాదని ముఖ్యంగా వికర్ సెక్షన్ కాలనీలలో మంచి నీటి సమస్య అధికంగా ఉన్నాదని కొన్ని కాలనీలలో బోర్లు కూడా లేవని దయచేసి వాళ్లకు క్రమంతప్పకుండా మంచి నీరు ఇవ్వాలని జలమండలి అధికారులను కొత్త రవి గౌడ్ కోరడమైనది.

# బ్రాహ్మణ సంక్షేమాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తాం

- నెల రోజుల్లో క్రెడిట్ సొసైటీ ఏర్పాటు
- పెండింగ్ పనులకు త్వరితగతిన అమలు
- 190 ఈవో పోస్టుల భర్తీ
- దేవాలయ పునరుద్ధరణకు రూ.300 కోట్ల బడ్జెట్
- పదవీ విరమణ చేసిన బ్రాహ్మణులకు రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ఆర్థిక సహాయం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**

తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు నూతన చైర్మన్‌గా బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా సుబ్రహ్మణ్య ప్రసాద్ నియమితులైన సందర్భంగా గురువారం ఉదయం బండ్లగూడలోని వసంత విహార్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దేవాదాయ మరియు అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథులుగా హాజరై నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్ సుబ్రహ్మణ్య ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని బ్రాహ్మణ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతామని ప్రకటించారు. బ్రాహ్మణ యువతకు ఉపాధి అవకాశాలు, విద్యా ప్రోత్సాహం, వేద పాఠశాలల అభివృద్ధి, అర్చకుల సంక్షేమం వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. బ్రాహ్మణ వర్గాల ఆర్థికాభివృద్ధి కోసం నెల రోజుల్లో ప్రత్యేక క్రెడిట్ సొసైటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే గతంలో పెండింగ్‌లో ఉన్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను త్వరితగతిన అమలు చేయడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. దేవాదాయ శాఖ పరిధిలో ఖాళీగా ఉన్న సుమారు 190 ఈవో (ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్) ఉద్యోగాలను త్వరలో భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆలయాల పరిపాలన బలోపేతం, భక్తులకు మెరుగైన సేవలందించడంలో ఈ నియామకాలు కీలకంగా మారనున్నాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న దేవాలయ పునరుద్ధరణ కోసం ప్రభుత్వం రూ.300 కోట్ల ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించిందని, ఈ నిధులతో ఆలయాలు, విద్యాసంస్థల అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ఆలయాల పునర్నిర్మాణం, ఆధునీకరణ పనులు చేపట్టడంతో పాటు విద్యా రంగానికి కూడా ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. పదవీ విరమణ చేసిన బ్రాహ్మణ కులస్తులకు రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించే విధానాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. అర్చకులు, వేద పండితులు మరియు బ్రాహ్మణ వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. బ్రాహ్మణ సంఘాల నుంచి వచ్చిన సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి బ్రాహ్మణ కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా పరిషత్‌ను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేణుగోపాలరావు, కేంద్ర మాజీ మంత్రి మరియు మాజీ పార్లమెంట్ సభ్యులు వేణుగోపాల చారి, తెలంగాణ రాష్ట్ర రోడ్లు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి, టీపీసీసీ సెక్రటరీ దుద్దిళ్ల శ్రీనివాస్ బాబు, చాకిలం రాజేశ్వర్ రావు, కొత్త కుర్మ శివకుమార్, టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, శ్రీ సత్యం శ్రీరంగం, బైరు వెంకన్న గౌడ్, మాజీ కార్పొరేటర్లు ముద్దగౌని లక్ష్మీప్రసన్న రామ్మోహన్ గౌడ్, ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే బ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులు, వివిధ జిల్లాల నుండి వచ్చిన పాలకవర్గ సభ్యులు, బ్రాహ్మణ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున హాజరై నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## బండి భగీరథను తక్షణమే అరెస్ట్ చేయాలి

**సిపిఐ నేత పానుగంటి పర్వతాలు డిమాండ్**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై నమోదైన పోక్సో కేసులో తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. గురువారం శంషాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 17 ఏళ్ల మైనర్ బాలికపై అత్యాచార ప్రయత్నం చేసిన ఆరోపణలతో భగీరథపై కేసు నమోదైందని తెలిపారు. అయినప్పటికీ విచారణ పేరుతో ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శించారు. తండ్రి అధికారాన్ని అడ్డంగా పెట్టుకొని భగీరథ పలు నేరాలకు పాల్పడుతున్నాడని, గతంలో కూడా అతని ప్రవర్తనపై అనేక ఆరోపణలు ఉన్నాయని పర్వతాలు అన్నారు. ప్రేమ పేరుతో మైనర్ బాలికను మోసం చేసి అత్యాచారానికి ప్రయత్నించడం దుర్మార్గమని, ఇలాంటి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. అలాగే, తన కుమారుడి తప్పును కప్పిపుచ్చేందుకు మంత్రి బండి సంజయ్ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ, చట్టం ముందు అందరూ సమానమనే భావనతో తన కుమారుడిని పోలీసులకు అప్పగించాల్సిన బాధ్యత ఆయనదని అన్నారు.ఈ కేసు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు మత నినాదాలను ఉపయోగించడం సిగ్గుచేటని విమర్శించారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే, బండి సంజయ్‌ను మంత్రివర్గం నుంచి తప్పించాలని కూడా డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు ఆర్. యాదగిరి, మండల కార్యదర్శి నర్రగిరి తదితరులు పాల్గొన్నారు.

## వి. హనుమంతరావుకు ఘన సన్మానం

**యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులై నేడు ప్రమాణ స్వీకారం చేసిన మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావుని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వి. హనుమంతరావుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేస్తూ, తన అనుభవంతో రాష్ట్ర అభివృద్ధికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలు మరియు ప్రభుత్వానికి విలువైన సూచనలు అందిస్తూ ప్రజలకు ఉపయోగపడే విధంగా పనిచేయాలని కోరారు. రాష్ట్ర రాజకీయాల్లో విశేష అనుభవం కలిగిన వి. హనుమంతరావు ప్రభుత్వ సలహాదారుగా నియమితులవడం శుభపరిణామమని జక్కిడి శివచరణ్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ఆయన మార్గదర్శకత్వం ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని వి. హనుమంతరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## హయత్‌నగర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

- ఎలక్ట్రానిక్స్, ఫర్నిచర్ దుకాణాలకు భారీ నష్టం
- అప్రమత్తంగా స్పందించిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సన్‌రైస్ హాస్పిటల్ ఎదురుగా సర్వీస్ రోడ్డులో గురువారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో జయశ్రీ ఎలక్ట్రానిక్స్ షాప్, లక్ష్మీనరసింహ కార్ డెకార్స్, ఒక ఫర్నిచర్ దుకాణం మరియు సమీపంలోని మరికొన్ని షాపులకు నష్టం జరిగినట్లు హయత్‌నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం..గురువారం రోజు తేదీ 14.05.2026 సాయంత్రం సుమారు 05:20 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే హయత్‌నగర్ పోలీసులు మరియు అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో మంటలు మరింత వ్యాపించకుండా నివారించగలిగారు. ఈ ప్రమాదంలో ముఖ్యంగా జయశ్రీ ఎలక్ట్రానిక్స్ షాప్ మరియు ఫర్నిచర్ దుకాణానికి భారీ నష్టం సంభవించినట్లు తెలిపారు. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చే అంశమని ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ పేర్కొన్నారు. పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడం వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని తెలిపారు. ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.



## విద్యా వారోత్సవాల్లో సేవా స్ఫూర్తి



**బ్లడ్ డొనేషన్ క్యాంప్ - మెగా పేరెంట్ టీచర్ మీట్**

**పాల్వంచ విశాలభారతి:**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు కార్యక్రమాలు ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల ఆధ్వర్యంలో బిక్కు తండాలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కళాశాల ఎన్‌సీసీ మరియు ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో, డాక్టర్ వేముల కామేశ్వరరావు నిర్వహణలో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం ఆధ్వర్యంలో ప్రత్యేక బ్లడ్ డొనేషన్ క్యాంపు ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమంలో బిక్కు తండా సర్పంచ్ శ్రీమతి ఝాన్సీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి చెందిన డాక్టర్ డి. సైదులు, అడిషనల్ టిహెచ్ఎంఓ పాల్గొని రక్తదాన ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ, అధ్యాపక బృందం, వైద్యులు, నర్సులు, విద్యార్థులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సేవా భావాన్ని చాటుకున్నారు. ఇదే సందర్భంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించి విద్యార్థుల విద్యాభివృద్ధిపై తల్లిదండ్రులతో చర్చించారు. అదేవిధంగా కళాశాల పూర్వ విద్యార్థులు ఎస్‌కే జానిమియా, వెంకట్, చంద్రశేఖర్, హేమ్లా నాయక్, కరేం సాయికుమారి, ఎన్ భానుప్రియ, కె. రాంబాబులను సన్మానించారు. 1998-2001 బీకాం బ్యాచ్ అలుమ్ని అసోసియేషన్ తరఫున చంద్రశేఖర్ కళాశాల అభివృద్ధి కోసం రూ.10,000 విరాళం అందజేశారు. కళాశాల యాజమాన్యం ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జె మాధవి డాక్టర్ కొండలరావు డి రమేష్ విజయ ప్రసాద్ డాక్టర్ శెట్టి స్వరూప రాణి కోట్లపు శ్రీనివాసరావు పారుల శ్రీనివాస్ కోటగిరి రాంబాబు డాక్టర్ శ్రీదేవి డాక్టర్ లీల ధర్మారావు రమేష్ దీపిక కరీమా భాను ప్రవీణ్ శివ తదితరులు పాల్గొన్నారు.

## పీజేటీయూలో భారత్–ఆస్ట్రేలియా స్మార్ట్ ఫార్మ్ నెట్‌వర్క్ ప్రారంభం



**రాజేంద్రనగర్, విశాలభారతి :**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీయూ)లో "ఇండియా-ఆస్ట్రేలియా స్మార్ట్ ఫార్మ్ నెట్‌వర్క్" (ఐఏఎస్ఫన్ ) కార్యక్రమాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ (రిచ్ ), చార్లెస్ స్టర్ట్ యూనివర్సిటీ (సీస్ యు ), బెంగళూరు సైన్స్ అండ్ టెక్నాలజీ క్లస్టర్ (బెస్ట్ ), సిఓఈఎఫ్‌పీఓ బెంగళూరు సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ నెట్‌వర్క్ ద్వారా వాతావరణ అనుకూల వ్యవసాయం, డిజిటల్ వ్యవసాయ సాంకేతికతలు, ప్రిసిషన్ ఫార్మింగ్, స్థిరమైన వ్యవసాయ విధానాల అభివృద్ధికి భారత్-ఆస్ట్రేలియా దేశాల మధ్య సహకారం మరింత బలోపేతం కానుందని నిర్వాహకులు తెలిపారు. విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు, స్టార్టప్‌లు, పరిశ్రమలు పరస్పరం భాగస్వామ్యం చేసుకుంటూ సంయుక్త పరిశోధనలు, పైలట్ ప్రాజెక్టులు, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా భారత్‌లో ఆస్ట్రేలియా హై కమిషనర్ ఫిలిప్ గ్రీన్ మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు భారత్-ఆస్ట్రేలియా భాగస్వామ్యం కీలకమని అన్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ, విద్యా సంస్థలు, పరిశ్రమలు, సాంకేతిక నిపుణులు, రైతుల మధ్య సమన్వయాన్ని పెంపొందించడంలో ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. 2047 నాటికి మానవ రహిత వ్యవసాయం లక్ష్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. చార్లెస్ స్టర్ట్ యూనివర్సిటీ ప్రో వైస్ చాన్స్‌లర్ మైకేల్ ఫ్రెండ్ మాట్లాడుతూ, పరిశోధన, ఆవిష్కరణల ద్వారా స్థిరమైన మరియు వాతావరణ అనుకూల వ్యవసాయ అభివృద్ధికి అంతర్జాతీయ భాగస్వామ్యాలు అవసరమని పేర్కొన్నారు. రిచ్ సంస్థ సీఈఓ రష్మీ పింపాలే మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా రైతులకు ఉపయోగపడే పరిష్కారాల అభివృద్ధికి పరిశోధనా సంస్థలు, స్టార్టప్‌లు, పరిశ్రమలు, ప్రభుత్వ విభాగాల మధ్య బలమైన అనుసంధానం ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత్, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన ప్రభుత్వ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి వనమానీ కలిసిన తుమ్మల



**పాల్వంచ, విశాలభారతి:** మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు ని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్వంచలోని వనమా నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తుమ్మల నలభై సంవత్సరాల రాజకీయ జీవితాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి వనమా తుమ్మల అభినందనలు తెలియజేశారు. గత నలభై ఏళ్లుగా కొనసాగుతున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఇద్దరు నాయకులు పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. అలాగే వనమా యాభై సంవత్సరాల రాజకీయ ప్రస్థానంలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షులుగా ప్రజలకు అందించిన సేవలను మంత్రి తుమ్మల కొనియాడారు. కొత్తగూడెం నియోజకవర్గం ప్రజల మనసుల్లో వనమా గారు చెరగని ముద్ర వేసుకున్న ప్రజానాయకుడని అభినందించారు. అనంతరం మంత్రి తుమ్మల వనమా దంపతులను సన్మానించి, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, BRS కార్పొరేటర్లు,నాయకులు, కార్యకర్తలు మరియు తుమ్మల, వనమా అభిమానులు పాల్గొన్నారు.

## పోలీసులు మీకోసం" అవగాహన కార్యక్రమం



**ఆదిలాబాద్, విశాలభారతి:** ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలంలోని వర్త మన్నూర్ గ్రామంలో ప్రజల భద్రత, చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు పోలీసులు నిర్వహించిన "పోలీసులు మీకోసం" కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామ ప్రజలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు ట్రాఫిక్ నియమాల పాటింపు, సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత, బాలల రక్షణ వంటి అంశాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అపరిచితుల ఫోన్ కాల్స్, OTP మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు. ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు. గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులతో సమన్వయంగా పనిచేయాలని, ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే స్పందించడం పోలీసుల బాధ్యత అని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజల్లో చట్టాలపై అవగాహన పెరగడంతో పాటు పోలీసులపై మరింత నమ్మకం ఏర్పడిందని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. "పోలీసులు మీకోసం" కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

## విద్యా వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలి

**46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి**



**పాల్వంచ విశాలభారతి:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విద్యా వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం కార్పొరేషన్ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి అన్నారు. ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా గురువారం పాత పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి, 47వ డివిజన్ కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు కార్పొరేటర్లను శాలువా, పూలదండలతో సన్మానించారు. ఈ సందర్భంగా విమలాదేవి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని, ప్రభుత్వం విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తున్నదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ ఆకుల పద్మలత, ఉపాధ్యాయులతో పాటు వార్డు ఆఫీసర్ నరేష్, పాఠశాల ఆదర్శ అమ్మదీవెన కమిటీ చైర్మన్ జి. అదిలక్ష్మి, గ్రామస్తులు మసనం శరత్, బూసి శ్రీను, యాటానాని, బండారు తేజ , జి. తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా "కొసల గ్రాండ్" ఓపెనింగ్

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ దొర**



**భద్రాచలం, విశాలభారతి:** పట్టణంలోని బ్రిడ్జి సెంటర్, లారీ ఆఫీస్ పక్కన అత్యాధునిక అంగులతో నిర్మించిన "కొసల గ్రాండ్" ఓపెనింగ్ ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని రిబ్బన్ కట్ చేసి కోసల గ్రాండ్ నీ ప్రారంభించారు. అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే వెంకటరావు, అటవీ అభివృద్ధి శాఖ కార్పొరేషన్ చైర్మన్ పొదేం వీరయ్య, టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు, భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోసల గ్రాండ్ నిర్వహుకులు చల్లగుళ్ళ నాగేశ్వరరావు వారికి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు పలువురు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## నాగోల్ సర్కిల్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

- జీతాలు, పీఎఫ్ బకాయిల కోసం పారిశుద్ధ కార్మికుల భారీ ఆందోళన
- విధుల బహిష్కరణతో నిలిచిపోయిన పారిశుద్ధ పనులు

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాగోల్ సర్కిల్ పెద్ద అంబర్‌పేట్ డివిజన్ కార్యాలయం వద్ద పారిశుద్ధ కార్మికులు గురువారం భారీ ఆందోళనకు దిగారు. గత రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో పాటు, ఎనిమిది నెలలుగా పెంచిన వేతనాలు మరియు పీఎఫ్ బకాయిలు కూడా అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ కార్మికులుగా తమకు అందించాల్సిన చీపుర్లు, నూనె, షూస్, సేఫ్టీ జాకెట్లు వంటి మౌలిక సదుపాయాలు కూడా అధికారులు కల్పించడం లేదని ఆరోపించారు. సరైన భద్రతా పరికరాలు లేకుండా విధులు నిర్వహించాల్సి వస్తోందని, సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ ఆందోళనకు సీఐటీయూ నాయకులు నర్సింహా మద్దతు తెలుపుతూ కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందించినప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతమంది కమిషనర్లు మారినా మా సమస్యలు మాత్రం మారడం లేదు. ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదు అంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద అంబర్‌పేట్ ప్రాంతంలో సుమారు 200 మంది మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది విధులు బహిష్కరించడంతో పారిశుద్ధ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో చెత్త తొలగింపు, పారిశుద్ధ నిర్వహణ పనులు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసిన కార్మికులు, లేనిపక్షంలో సోమవారం నుంచి ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



# కురవి తహసిల్దార్ కార్యాలయంలో వింత పోకడ..?

- 'సర్వే నెంబర్ ఉంటే సరిపోదు.. ఖాతా ఉంటేనే పట్టా!'
- కలెక్టర్‌కు చెప్పినా సరే.., తేల్చిచెబుతున్న రెవెన్యూ అధికారులు.
- 'భూభారతి' పరిష్కార వేదికల్లో అర్జీలు పెట్టుకున్నా తప్పని తిప్పలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న కురవి మండల బాధిత రైతులు




**కురవి విశాల భారతి:**

తాతముత్తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూమి ఉంది. ప్రభుత్వ రికార్డుల్లో సర్వే నెంబర్ ఉంది. కానీ, ఆ భూమికి వారసత్వ పట్టా మార్పిడి చేయాలంటే మాత్రం తహసిల్దార్ కార్యాలయం నుంచి పొంతనలేని సమాధానాలు వస్తున్నాయి. "మీకు భూమి ఉండి, సర్వే నెంబర్ ఉన్నా మాకు సంబంధం లేదు.. కంప్యూటర్ లో భూభారతి ద్వారా ఖాతా నెంబర్ ఉంటేనే పట్టా చేస్తాం.., లేదంటే ఫైల్ పక్కన పడేస్తాం.., మీరు జిల్లా కలెక్టర్‌కు, ఆర్డీఓకు ఫిర్యాదు చేసినా మేము చేసేదేం లేదు" అంటూ కురవి తహసిల్దార్ కార్యాలయ అధికారులు తెగేసి చెబుతుండటంతో బాధిత రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

**కంప్యూటర్ లో చూపడం లేదని కొర్రీలు!**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'భూభారతి' సమస్యల పరిష్కార కార్యక్రమంలో భాగంగా బాధిత రైతులు తమ భూ సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారు. దీనిపై స్పందించిన అధికారులు బాధితులకు నోటీసులు జారీ చేసి, అభ్యంతరాలు సేకరించి, క్షేత్రస్థాయిలో భూముల సర్వేలు కూడా నిర్వహించారు. అంతా సవ్యంగానే జరిగిందని భావిస్తున్న తరుణంలో, ఇప్పుడు తీరా పట్టా ఇచ్చే సమయానికి అధికారులు ఉల్టా మాట్లాడుతున్నారు. భూభారతి కంప్యూటర్ రికార్డుల్లో సర్వే నెంబర్, ఖాతా నెంబర్ చూపడం లేదనే నెపంతో దరఖాస్తులను పెండింగ్‌లో పెడుతూ కాలయాపన చేస్తున్నారు.

**రైతుల ప్రశ్న.. అధికారుల నిర్లక్ష్యం**

"మాకు క్షేత్రస్థాయిలో భూమి ఉంది, సర్వే నెంబర్ ఉంది. మరి ప్రభుత్వ రికార్డుల్లో, భూభారతి కంప్యూటర్ లో మా వివరాలు ఎందుకు నమోదు కాలేదు? దానికి బాధ్యులు ఎవరు?" అని రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ అధికారుల తప్పిదాల వల్ల ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు కాకపోతే, దానికి తామెలా బాధ్యులమవుతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎవ్వరికి పిర్యాదు చేసిన పర్వాలేదు..,**

ఉన్నతాధికారులైన జిల్లా కలెక్టర్, ఆర్డీఓలకు ఫిర్యాదు చేసినా లాభం లేదంటూ కురవి రెవెన్యూ సిబ్బంది ఉక్కుం జారీ చేస్తుండటంతో, "ఇక మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి?" అని రైతాంగం కన్నీరుమున్నీరవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా భూభారతి రికార్డులను సవరించి, తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## జాతీయ రహదారి విస్తరణ పనులపై మాజీ కార్పొరేటర్ పరిశీలన: కళ్లెం నవజీవన్ రెడ్డి



**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** జాతీయ రహదారి విస్తరణలో భాగంగా హయత్‌నగర్ పరిధిలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ మరియు అభివృద్ధి పనులను హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ట్రాఫిక్ మరియు ఆర్ & బి అధికారులతో కలిసి నేడు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. సర్వీస్ రోడ్లకు ఆనుకుని ఉన్న కాలనీలకు ప్రధాన రహదారితో బీటీ కనెక్టివిటీ లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కాలనీవాసుల సౌకర్యార్థం తక్షణమే కనెక్టివిటీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే సర్వీస్ రోడ్లపై ఎక్కడపడితే అక్కడ పండ్ల బండ్లు, తోపుడు బండ్లు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోందని, వాహనదారులు మరియు ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ట్రాఫిక్ సమస్యలు తగ్గించేలా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. డిపో సమీపంలో నిర్మాణంలో ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులను వేగవంతం చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత దృష్ట్యా ఈ పనులను ప్రాధాన్యతగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యం, ట్రాఫిక్ నియంత్రణ, మౌలిక వసతుల అభివృద్ధే లక్ష్యంగా తాను నిరంతరం కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి తెలిపారు. ఈ పరిశీలనలో ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, ఆర్ & బి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితులతో కలిసి భర్తపై భార్య దాడి

**జరిగిన ఘటన సీసీ కెమెరాల్లో రికార్డు .. రక్షణ కల్పించాలని పోలీస్ స్టేషన్లో భర్త పిర్యాదు**



**ఉప్పల్, విశాలభారతి:** భర్తపై స్నేహితులతో కలిసి భార్య దాడి చేసిన ఘటన హైద్రాబాద్ లోని బోడుప్పల్లో చోటు చేసుకుంది.వివరాలు ఇలా ఉన్నాయి సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ దంపతులు ఒకే స్కూల్లో చదువుతూ 7వ తరగతి8 నుండి ప్రేమించుకున్నారు.కాగా ఇరువురి తల్లితండ్రులను ఒప్పించి 2024న వివాహం చేసుకున్నారు.సవంత్సరం సజావుగా సాగిన వారి జీవితాల్లోకి మూఢనమ్మకం అనే పోను భూతంతో వివాదాలు తలెత్తి కొన్ని నెలలుగా భార్య భర్తలు దూరంగా ఉంటున్నారు.ఇదిలా ఉండగా రూమ్ లో బట్టలు ఉన్నాయనే నెపంతో భర్త దెగ్గరకు వచ్చిన భార్య తన స్నేహితులతో కలసి వాగ్వాదం సృష్టించి భర్తపై దాడి చేయించింది.ఈ ఘటనంతా సీసీ కెమెరాలో రికార్డు అయింది.ఈ విషయంపై భర్త మేడిపల్లి పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు.నాగోల్ పథల్ గూడ జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగానికి చెందిన వంశి తన తోపాటు పని చేసి మరో నలుగురు డ్యూటీకి డ్యుమ్మా కొట్టి మధ్యాహ్నం సుమారు 2:50 సమయంలో దాడి చేయడం చర్చనీయాంశంగా మారింది.భాధ్యత గల వృత్తిలో విధులు నిర్వహించాల్సిన వాళ్ళు ఇండ్లపైకి వచ్చి రౌడీయిజం చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..ఉన్నతాధికారులు స్పందించి బాధ్యతారహితంగా ఉన్న సదురు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## కార్పొరేషన్ చైర్మన్లకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శుభాకాంక్షలు

- సరిత తిరుపతయ్య, దాసరిరాజు అజయ్ కుమార్
- సన్మానించిన జక్కిడి శివచరణ్ రెడ్డి

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** తెలంగాణ రాష్ట్ర షీప్స్ అండ్ గోట్స్ కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులై గురువారం రోజు పదవీ బాధ్యతలు స్వీకరించిన సరిత తిరుపతయ్యని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేస్తూ, తమ పదవిలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. పశుసంవర్ధక రంగ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి గొర్రెలు, మేకల పెంపకదారులకు అండగా నిలవాలని సూచించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర వాషర్‌మెన్ (రజక) కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన దాసరిరాజు అజయ్ కుమార్ ని కూడ కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. రజక వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం మరింత కృషి చేయాలని కోరారు. ఈ సమావేశాలు స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగగా, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని జక్కిడి శివచరణ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర విద్యామంత్రి రాజీనామా చేయాలి

- సీపీఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ డిమాండ్



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనకు కేంద్ర విద్యాశాఖ మంత్రి పూర్తి బాధ్యత వహించాలని సీపీఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరిసింగ్ నాయక్ మాట్లాడుతూ...దేశవ్యాప్తంగా సుమారు 23 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాశారని, ప్రస్తుతం వారు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. డాక్టర్ కావాలనే లక్ష్యంతో ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి సిద్ధమైన విద్యార్థుల ఆశలపై ఈ పేపర్ లీకేజీ నీళ్లు చల్లినట్టైందని ఆవేదన వ్యక్తం చేశారు. సమయం కేటాయించి శ్రమించిన విద్యార్థులు తీవ్ర అయోమయంలో ఉన్నారని, పరీక్ష నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తన పారదర్శకతను నిరూపించుకోవడంలో విఫలమైందని విమర్శించారు.నీట్ పేపర్ లీకేజీకి పాల్పడిన కార్పొరేట్ విద్యా మాఫియాపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో నిష్పక్షపాత విచారణ జరిపి, లీకేజీకి సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి విద్యా రంగంపై ఉన్న నిర్లక్ష్యం ఈ ఘటనతో బహిర్గతమైందని ఆరోపించారు. ఇలాంటి పేపర్ లీకేజీల కారణంగా విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యా రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## గిరెడ్డిఅరుణ భాస్కర్ రెడ్డి కుటుంబానికి సీపీఐ నేతల పరామర్శ

- దశదినకర్మలో పాల్గొని చిత్రపటానికి నివాళులర్పించిన నాయకులు



**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** నవచేతన ఎంప్లాయీ, రావి నారాయణరెడ్డి కాలనీ వాసి గిరెడ్డి అరుణ - భాస్కర్ రెడ్డి దంపతుల చిన్న కుమారుని దశదినకర్మ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి పాల్గొని చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిన్న కుమారుని మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఆ కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, నవచేతనకు చెందిన మధుకర్, మదన్, సుధాకర్ రెడ్డి, అనిల్, ధూపం నిరంజన్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## మెట్రో ఉదయం రిపోర్టర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

- పంది జగదీష్ కుమార్ మృతిపై సంతాపం.. మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి

**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడెం గ్రామానికి చెందిన మెట్రో ఉదయం రిపోర్టర్ పంది జగదీష్ కుమార్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని గురువారం ఉదయం గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.10,000/ఆర్థిక సహాయం అందజేశారు. జర్నలిస్టు జగదీష్ కుమార్ మృతి జర్నలిస్టు వర్గాలకు తీరని లోటని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లష్కర్‌గూడెం గ్రామ సర్పంచ్ అల్లే ఐలయ్య యాదవ్, గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొని జగదీష్ కుమార్‌కు శ్రద్ధాంజలి ఘటించారు.



## వాణిజ్య పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి



- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్
- నకిలీ, విత్తనాలు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు
- జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:**

జిల్లాలోని సొసైటీ చైర్మన్లు, వ్యవసాయ శాఖ, సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ టాస్క్ ఫోర్స్ కమిటీ, డీలర్స్ షాపు యజమానులతో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, ఎరువులు, ఫర్టిలైజర్ వినియోగం, వాడకం, సరఫరా పై గురువారం సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలు 76, ఆగ్రోస్ రైతు కేంద్రాలు 47, హాక 14, ఓడిఎమ్మఎస్ 10, ప్రైవేటు రిటైల్స్ షాపులు 530, మొత్తం 677 ల ద్వారా జిల్లాలోని రైతులకు ఎరువులను సీడ్స్ ను అందించడం జరుగుతుందని అందుకు తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు, జిల్లాలో 4,53,475 ఎకరాలలో ప్యాడి, కాటన్, మిర్చి, మక్కజొన్న, తదితర పంటలు ఉన్నాయని, వానాకాలం 2026 సీజన్ కి సంబంధించి యూరియా, 36026.4, డిఏపి 6092.4, mop 1282.6, ఎస్ఎస్పీ 851.07, npk 24776.2, రైతులకు అందించడం కోసం జిల్లా యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని తెలిపారు, ప్రతి ఒక్కరూ ఇతర పంటల వైపు మొగ్గు చూపే విధంగా చర్యలు తీసుకోవాలని అందుకు అవగాహన కల్పించాలని ముందుగా సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు ఆదర్శంగా తీసుకొని ఇతరులకు దారి చూపాలని కలెక్టర్ తెలిపారు, మిల్లెట్స్, ఆయిల్ పామ్, ఇతర వాణిజ్య పంటలు వేస్తే రైతులకు అధిక లాభాలు వస్తాయని, ఆ విధంగా డీలర్లు సైతం వారికి అవగాహన కల్పించాలని అన్నారు, అధిక యూరియా వాడితే నేల సారవంతం పోతుందని తద్వారా రైతులకు నష్టమని, వివరంగా చెప్పాలన్నారు, నానో యూరియా పై ప్రత్యేక దృష్టి పెట్టి ముందుకు సాగాలని తెలిపారు,

జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ జిల్లాలో కల్తీ ఎరువులు విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుని పిడి యాక్ట్ నమోదు చేస్తామని, కావున అది గమనించి ప్రతి ఒక్కరూ నాణ్యమైన ప్రభుత్వం గుర్తించిన విత్తనాలు ఎరువులు మాత్రమే విక్రయించాలని సూచించారు, నకిలీ ఎరువులు విత్తనాల నివారణ నిమిత్తం జిల్లాలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశామని, ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి నేతృత్వంలో ఈ కమిటీ విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు, ఏదైనా నకిలీ విత్తనాల ఎరువుల సమాచారం ఉంటే నేరుగా ఇన్స్పెక్టర్ హతిరామ్ 8712656920 నెంబర్లు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుదామని ఎస్పీ తెలిపారు, ఈ సమావేశంలో పాల్గొన్న వారికి అగ్రికల్చర్ ఏవోలు జావేద్, ఛాయా రాజ్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎరువులు, విత్తనాల వాడకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో పాల్గొన్న వివిధ సొసైటీల చైర్మన్లు డీలర్స్ వారి యొక్క సూచనలు సలహాలు అందించారు, ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారిని సరిత, డి సి ఓ వెంకటేశ్వర్లు, అన్ని విభాగాల సంబంధిత అధికారులు, సొసైటీ చైర్మన్లు, వ్యవసాయ శాఖ అధికారులు, సీడ్స్ ఫర్టిలైజర్ షాపులు యజమానులు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## మీడియాపై అనుచిత వ్యాఖ్యలు సహించం

- జర్నలిస్టులను అవమానించిన వీరన్నపై కాంగ్రెస్ కఠిన చర్యలు తీసుకోవాలి
- వీరన్నపై పార్టీ చర్యలకు డిమాండ్
- టియుడబ్ల్యూజే(ఐజేయు) జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్



**మహబూబాబాద్ విశాల భారతి:**

జర్నలిస్ట్ సమాజం ఆత్మగౌరవానికి భంగం కలిగించేవిధంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ డాక్టర్ సెల్ రాష్ట్రకార్యదర్శి డాక్టర్ వీరన్న నాయక్ పై కాంగ్రెస్ పార్టీ చర్యలు తీసుకోవాలని, జర్నలిస్ట్ లకు డాక్టర్ వీరన్న బహిరంగ క్షమాపణ చెప్పాలని టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ..అంశంపై కురవి మండల జర్నలిస్ట్ లతో గురువారం మాట్లాడిన అనంతరం జిల్లాప్రదానకార్యదర్శి గాడిపల్లి శ్రీహరితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర స్థాయి పదవిలో ఉండి.., బిజేపి ఎంపి తో కురవి ఆలయంలో పూజాకార్యక్రమంలో పాల్గొనడం.., సెల్ఫీలు దిగడం డాక్టర్ వీరన్ననాయక్ బహిరంగంగానే చేసారన్నారు. ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ కురవి మండలానికి చెందిన జర్నలిస్ట్ సహదేవ్ వార్త రాసాడని.., దానికి వివరణ ఇచ్చుకునే ప్రయత్నమో..., లేదంటే ఎందుకు సెల్ఫీలు దిగాల్సివచ్చిందో తెలియజేయకుండా..., తానే జర్నలిస్ట్ లపై సోషల్ మీడియాలో ప్రతిదాడికి దిగాడని, సహదేవ్ తోపాటు..., జర్నలిస్ట్ లందరిని పలుచని చేసే విధంగా పోస్టింగ్ లు చేయడమేకాకుండా, జర్నలిస్ట్ ల సామాజిక గౌరవాన్ని, వృత్తిపరమైన విలువలను పట్టించుకోకుండా డాక్టర్ వీరన్న వ్యాఖ్యలు చేసారన్నారు. అయినప్పటికీ ఈ..విషయాన్ని వివాదం చేయకూడదని, కాంగ్రెస్ నాయకుల సమక్షంలోనే చర్చించాలని ఆలోచనతో కురవి మండల జర్నలిస్ట్ లు ప్రయత్నం చేసినా..., డాక్టర్ వీరన్న పద్దతిలో మార్పురాలేదని, పార్టీ ముఖ్యనాయకులు చెప్పిన పట్టింపులేని దోరణితో వ్యవహరిస్తున్నాడని శ్రీనివాస్ అన్నారు. మార్పు రావాలని., చేసిన తప్పిదాన్ని తెలుసుకోవాలని, జర్నలిస్ట్ ల పట్ల చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని సిహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ జర్నలిస్ట్ లతో ఎంతో స్నేహపూర్వకంగా ఉంటారని వారి స్వంత నియోజకవర్గంలో కాంగ్రెస్ రాష్ట్రస్థాయి నాయకుని తీరు ఇలా ఉండడం విచారకరమని శ్రీనివాస్ తెలిపారు. సంఘటన జరిగి చాలారోజులైన ఇప్పటివరకు సంయమనంతోనే వ్యవహరించామని గుర్తుచేసారు. చేసిన తప్పును, పొరపాటు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోనట్లయితే.., మొదట డోర్నకల్ నియోజకవర్గవ్యాప్తంగా, తర్వాత మహబూబాబాద్ జిల్లావ్యాప్తంగా టియుడబ్ల్యూజే(ఐజేయు) ఆధ్వర్యంలో జర్నలిస్ట్ లను అందరిని కలుపుకొని నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, జిల్లాప్రదానకార్యదర్శి గాడిపల్లి శ్రీహరి హెచ్చరించారు.

## మన ఊరు మన భద్రత మన బాధ్యత

**విశాల భారతి, ఆర్మూర్:** ఆర్మూర్ మండలం మిర్ధ పల్లి గ్రామంలో గురువారం రోజు మన ఊరు మన భద్రత మన బాధ్యత అనే కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్యనారాయణ గౌడ్, ట్రాఫిక్ నియమాల గురించి, మత్తు పదార్థాల గురించి, సైబర్ నేరాల కార్యక్రమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలు, విడిసి సభ్యులు గ్రామ సర్పంచ్ ఎల్ల సాయి రెడ్డి, వార్డు మెంబర్లు, ఐకెపి, మహిళా సంఘాలు, యువకులు, షీ టీం పాల్గొన్నారు.

## ఆకృతి టౌన్‌షిప్‌లో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం




**బోడుప్పల్ విశాలభారతి:** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకృతి టౌన్‌షిప్‌లో సైబర్ క్రైమ్ పై అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మల్కాజిగిరి కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు ప్రజలకు సైబర్ నేరాలపై జాగ్రత్తలు తెలియజేశారు. ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్ కాల్స్, OTP మోసాలు వంటి విషయాలపై ప్రజలకు వివరంగా అవగాహన కల్పించారు. అధికారులు మాట్లాడుతూ, ఎవరైనా అనుమానాస్పద కాల్స్ లేదా మెసేజ్‌లు వచ్చినప్పుడు వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు పంచుకోకూడదని సూచించారు. అలాగే సైబర్ మోసాలకు గురైనట్లయితే వెంటనే 1930 హెల్ప్‌లైన్ కు కాల్ చేయాలని, లేదా అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, పోలీస్ అధికారుల సూచనలు ఆసక్తిగా విన్నారు.

## బోడుప్పల్లో సాయి శ్వేతా హాస్పిటల్ ప్రారంభోత్సవం

- నాణ్యమైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- మేడ్చల్ మల్కాజిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రష్ యాదవ్



**బోడుప్పల్ విశాలభారతి:** బోడుప్పల్ లో నూతనంగా ఏర్పాటు చేసిన సాయి శ్వేతా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ భరత్ ఆధ్వర్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి .మేడ్చల్‌మల్కాజిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరై హాస్పిటల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం చాలా ముఖ్యమని, ప్రాంత ప్రజలకు అందుబాటు ధరల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని హాస్పిటల్ నిర్వాహకులకు సూచించారు. ఇలాంటి ఆసుపత్రులు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ వాసులు, హాస్పిటల్ వైద్యులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. హాస్పిటల్ ప్రారంభం సందర్భంగా నిర్వాహకులు ముఖ్య అతిథులను శాలువాతో సన్మానించారు. స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం పట్ల ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## మున్సిపల్ అధికారులపై వేధింపులు ఆపాలి

- జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన ప్రజాప్రతినిధులు



**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** రంగా రెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ అధికారులపై స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వేధింపులు ఆపాలని, అక్రమ కేసులను నిరోధించి మున్సిపల్ పాలనా వ్యవహారాలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ... మున్సిపల్ అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు, వేధింపులు పెరగడం వల్ల పరిపాలన వ్యవస్థ దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో అధికారులు స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితులు కల్పించాలని కోరారు. అక్రమ కేసులు, రాజకీయ జోక్యాల వల్ల మున్సిపల్ పరిపాలనలో అంతరాయం కలుగుతోందని పేర్కొంటూ, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని అధికారులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి,ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ముత్యాల శ్యామలతో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీసా పేరుతో రూ.10 కోట్ల మోసం

- గచ్చిబౌలిలో 130 మంది నిరుద్యోగులకు శ్రీ ఇమ్మిగ్రేషన్ కుచ్చుటోపీ
- నకిలీ వీసాలిచ్చి పరారైన నిర్వాహకులు.. పోలీసుల జాప్యంపై బాధితుల ఆగ్రహం

**సైబరాబాద్ విశాలభారతి:** ఆస్ట్రేలియా వర్క్ వీసాలు ఇప్పిస్తామని నమ్మించి తెలుగు రాష్ట్రాలకు చెందిన 130 మంది నిరుద్యోగుల నుంచి రూ.10 కోట్లు వసూలు చేసి 'శ్రీ ఇమ్మిగ్రేషన్ అండ్ వీసాస్' నిర్వాహకులు బోర్డు తిప్పేసి పరారయ్యారు. సబ్‌క్లాస్ 482 వర్క్ వీసాల పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.7 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు వసూలు చేసిన నిర్వాహకులు చివరికి నకిలీ వీసాలు అంటగట్టి ఆఫీసుకు తాళం వేశారని బాధితులు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు.ఉద్యోగం వస్తుందన్న ఆశతో అప్పులు చేసి, పొలాలు తాకట్టుపెట్టి, తల్లిదండ్రుల నగలు అమ్మి డబ్బులు కట్టామని బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. వీసా ప్రాసెసింగ్, డాక్యుమెంటేషన్ పేరుతో దశలవారీగా డబ్బులు గుంజుకున్న నిర్వాహకులు ఆరు నెలలుగా కాలయాపన చేస్తూ వచ్చారని వాపోయారు. చివరకు ఇచ్చిన వీసాలు నకిలీవని తేలడంతో తాము మోసపోయామని గ్రహించామని తెలిపారు. గత వారం గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేసి చేతులు దులుపుకున్నారని, నిందితులను పట్టుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్, ఎస్పీ సంయుక్త పర్యవేక్షణ





**రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు**

**మహబూబాబాద్ విశాల భారతి:**

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి స్నేహ శబరీష్, అధికారులను ఆదేశించారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర సకాలంలో అందేలా కొనుగోలు కేంద్రాల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గురువారం నెల్లికుదురు మండల పరిధిలోని ఆలేరు, లాస్య తండా గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ శ్రీమతి స్నేహ శబరీష్, ఐఏఎస్ మరియు జిల్లా ఎస్పీ డా. శబరీష్, కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాలలో ధాన్యం నిల్వలు, తేమ శాతం పరీక్షలు, రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ధాన్యం తరలింపు ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తీసుకొచ్చే ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం రవాణాలో ఆటంకాలు లేకుండా అవసరమైన లారీలను అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ తదితర కనీస సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. జిల్లా ఎస్పీ డా. శబరీష్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ తరపున ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక పోలీస్ అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ధాన్యం రవాణా సమయంలో అక్రమాలు, మధ్యవర్తుల జోక్యం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం అధికారులు కొనుగోలు కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ధాన్యం తూకం, నాణ్యత పరిశీలన ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతి రావు, కేసముద్రం సీఐ సత్యనారాయణ, నెల్లికుదురు ఎస్ఐ రమేష్, పోలీస్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన ఎల్‌బీ నగర్ జోనల్ కమిషనర్‌కు శుభాకాంక్షలు

**వికాస్ మహాతోను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్:** నూతనంగా ఎల్‌బీ నగర్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వికాస్ మహాతో ని వారి కార్యాలయంలో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఎల్‌బీ నగర్ జోన్ పరిధిలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా హయత్‌నగర్ డివిజన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, రోడ్ల అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశం సానుకూల వాతావరణంలో కొనసాగగా, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పరస్పర సహకారంతో ముందుకు సాగాలని మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి తదితరులు పాల్గొని జోనల్ కమిషనర్ వికాస్ మహాతో ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## కోదండరాంను కలిసిన ఉద్యమకారులు



**సికింద్రాబాద్, విశాలభారతి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ఎమ్మెల్సీ బాధ్యతలు తీసుకున్న తెలంగాణ ఉద్యమ నేత కోదండరాంకు ప్రత్యేక అభినందన తెలిపిన తెలంగాణ ఉద్యమకారుడు పొట్లకాయ వెంకటేశ్వర్లు ముదిరాజ్, మహిళా నాయక నిర్మల ముదిరాజ్, అనేకమంది తెలంగాణ కోసం పోరాడిన కార్యకర్తలు అభిమానులు కోదండరాంకి అభినందనలు తెలపడం జరిగింది

## బడిబాటతో విద్యా వెలుగులు

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ ప్రజాప్రతినిధుల చైతన్య యాత్ర**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం నిర్వహించిన "బడిబాట" కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ పాల్గొని విద్యార్థుల చేరికలు పెంపొందించేందుకు ప్రజలను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా నాయకులు గ్రామ ప్రజలను ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి బాలబాలిక విద్యను అభ్యసించడం సమాజ అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా గ్రామంలో విద్యాపై అవగాహన పెంపొందించడంతో పాటు డ్రాప్‌అవుట్ విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బండారి సత్యనారాయణ, రాపోలు మల్లేష్, విద్యా కమిటీ అధ్యక్షురాలు కొమురెల్లి రేణుక, పాఠశాల ఉపాధ్యాయురాలు లలిత తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య స్కూల్‌లో సీబీఎస్ఈ ప్లస్ వన్ ప్రారంభం





**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రామగుండం ఎరువుల కర్మాగారం ఆవరణలోని శ్రీ చైతన్య హై స్కూల్‌లో 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి సీ.బీ.ఎస్.ఈ ప్లస్ వన్ (11వ తరగతి) తరగతులను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, మే 14 నుండి మే 28 వరకు కొనసాగే ఓరియంటేషన్ క్లాసులను అధికారికంగా ప్రారంభించారు. ఇంటర్మీడియట్ విద్యలోకి అడుగుపెడుతున్న విద్యార్థులకు దిశానిర్దేశం చేసేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ 15 రోజుల పాటు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల కోసం అనుభవజ్ఞులైన లెక్చరర్లచే ఉచితంగా అవగాహన తరగతులు నిర్వహించనున్నారు. ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థులు ఎంచుకోదగ్గ వివిధ కోర్సులు, భవిష్యత్తులో ఉండే అవకాశాల గురించి నిపుణులు క్షుణ్ణంగా వివరించనున్నారు. ఈ అద్భుతమైన అవకాశాన్ని పదో తరగతి విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల యాజమాన్యం కోరింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శాంత, ఇంటర్మీడియట్ డీన్ లక్ష్మీనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. వీరితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సీ.బీ.ఎస్.ఈ ప్లస్ వన్ విభాగాన్ని అందుబాటులోకి తీసుకురావడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## మోడీ పాలనలో ఆర్థిక సంక్షోభం దిశగా భారత్

**నల్లు సుధాకర్ రెడ్డి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు**

**డోర్నకల్ విశాల భారతి:** మోడీ తమ పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రజలకు నీతులు వల్లే వేస్తు, ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నాడని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం డోర్నకల్ పట్టణ కౌన్సిల్ సమావేశం జన్నె స్వామి అధ్యక్షతన జరగగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ భారత్ అని అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నానని గొప్పలు చెప్పుకున్న ప్రధాని మోడీ, నేడు ప్రజలకు బంగారం కొనొద్దు పెట్రోల్ డీజిల్ వాడకం తక్కువ చేయాలి, విదేశీ ప్రయాణాలు తగ్గించాలనే నీతి సూక్తులు వల్లే వేస్తు, తమ 12 సంవత్సరాల పాలన వైఫల్యాలను, దివాళ కోరు విధానాలను కప్పిపుచ్చుకోవడానికి నాటకాలు మొదలుపెట్టాడని తీవ్రంగా విమర్శించారు. ఆర్థిక సంక్షోభం నెలకొన్నప్పుడు పేద, మధ్య తరగతి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయకుండా కోటీశ్వరులపై రెండు నుంచి ఐదు శాతం పన్నులు వేయాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నా పట్టించుకోకుండా కార్పొరేట్లతో కుమ్మక్కై ఆర్థిక వ్యవస్థను దిగజార్చుతూ డీజిల్, పెట్రోల్ ఇతర వస్తువుల ధరలు భారీగా పెంచడానికి కుయుక్తులు పన్నుతున్నారని అన్నారు. డోర్నకల్ పట్టణ కన్వీనర్ గా ఎల్లవుల నరసింహారావుని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ఈయన గతంలో పార్టీలో చురుకైన పాత్ర పోషించి, పోస్టల్ డిపార్ట్మెంట్లో ఉద్యోగం పొంది పదవీ విరమణ అనంతరం సిపిఐ లో తిరిగి చేరి పట్టణ కార్యదర్శిగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ పెరుగు దలకు, సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలు నిర్మిస్తానని, జిల్లా నాయకత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి తురక రమేష్ సీనియర్ నాయకులు కే ప్రబేష్, కే ప్రభాకర్, ఎస్.కె మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి బాలుడు మృతి



**మునుగోడు విశాల భారతి :** ప్రలిపలుపుల గ్రామంలో విషాదం నెలకొంది కాయిత లక్ష్మణ్ కుమారుడు అఖిల్ (13) వేసవి సెలవుల్లో సరదాగా స్నేహితులతో కలిసి స్థానిక చెరువులో ఈతకు వెళ్లాడు ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు కుమారుడి మరణంతో తల్లిదండ్రులు కన్నీరుము న్నీరవుతున్నారు పోలీసులు కేసు నమోదు దర్యాపు చేస్తున్నారు సెలవల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులు కోరుతున్నారు

## పెద్దతండాలో పెళ్లి వేడుకలకు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



- **నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రజానేత**
- **ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు**

**కురవి, విశాల భారతి**

డోర్నకల్ నియోజకవర్గంలోని కురవి మండల పెద్దతండ గ్రామం గురువారం వివాహ వేడుకల సందడితో కళకళలాడింది. తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్ గ్రామంలో నిర్వహించిన పలు వివాహ, రిసెప్షన్ కార్యక్రమాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. గ్రామ ప్రజలు, అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికి ఆత్మీయంగా ఆహ్వానించారు. ముందుగా పెద్దతండ గ్రామానికి చెందిన మాలోత్ ఆలు కుమారుడు నగేష్ రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొన్న సత్యవతి రాథోడ్ వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వివాహ బంధం పరస్పర ప్రేమ, నమ్మకం, కుటుంబ విలువలతో బలపడాలని ఆకాంక్షించారు. అనంతరం గూగులోత్ కోటేష్ కుమార్తె అనిత వివాహ కార్యక్రమానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. సంప్రదాయ బంజారా సంస్కృతి ప్రతిబింబించేలా నిర్వహించిన వివాహ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొనగా, యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలకు ఉత్సాహాన్ని తీసుకొచ్చారు. కార్యక్రమంలో మహబూబాబాద్ మాజీ జడ్పీ చైర్మన్ ఆంగోత్ బిందుతో పాటు రాష్ట్ర బీఆర్ఎస్ యువనాయకులు గుగులోత్ శ్రీరాం నాయక్, సునీల్ రాథోడ్, డాక్టర్ సతీష్ రాథోడ్, సిరి నాయక్, బండ బిక్షం రెడ్డి, బోడ శ్రీను నాయక్, మన్యు ప్యాట్నీ, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, బానోత్ హరి నాయక్, గండి వీరేందర్ గౌడ్, ఐక్య రాజ్, వినయ్ చంద్ర, శివ, శంకర్, నరేష్, బొమ్మకంటి వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలతో సత్యవతి రాథోడ్ ఆత్మీయంగా మమేకమై వారి కుటుంబ సభ్యులను పలకరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె రాకతో పెద్దతండ గ్రామం సందడి వాతావరణాన్ని సంతరించుకుంది.

## రాజేంద్రనగర్‌లో సమస్యలపై సమగ్ర సమీక్ష




- **వర్షా కాలానికి ముందస్తు చర్యలు చేపట్టాలి**
- **అధికారులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆదేశం**

**రాజేంద్రనగర్, విశాలభారతి :**

రాజేంద్రనగర్ జోన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సూచించారు. ఈ నేపథ్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి గారి అధ్యక్షతన గురువారం కీలక సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో జోన్ పరిధిలోని మౌలిక సదుపాయాలు, తాగునీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలు, విద్యుత్ సరఫరా లోపాలు వంటి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వబడింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ గారు, క్షేత్రస్థాయిలో ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులను అప్రమత్తం చేశారు. జిహెచ్‌ఎంసి, వాటర్ వర్క్స్ మరియు విద్యుత్ శాఖలకు సంబంధించిన పనుల పురోగతిని ఒక్కొక్కటిగా సమీక్షిస్తూ, ఆలస్యం జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. "ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి. ఫీల్డ్ స్థాయిలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ముఖ్యంగా వర్షాకాలం సమీపిస్తున్న దృష్ట్యా కాల్వల శుభ్రపరిచే పనులు, రోడ్ల మరమ్మత్తులు, నీటి నిల్వ సమస్యల నివారణ వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అదేవిధంగా తాగునీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని, విద్యుత్ సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ విభాగం, వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖల ఉన్నతాధికారులు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు. సమావేశం ద్వారా స్థానిక సమస్యల పరిష్కారానికి సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయబడినట్లు అధికారులు తెలిపారు.

## భార్యను వేధింపులకు గురిచేసిన భర్త

**ఆత్మహత్యకు ప్రేరేపించిన భర్తపై కేసు నమోదు.. కురవి ఎస్సై బి. సతీష్**



**కురవి విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలో వివాహిత ఆత్మహత్య ఘటన కలకలం రేపింది. మృతురాలి తండ్రి మండల వెంకన్న ఫిర్యాదు మేరకు కురవి పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, కురవి గ్రామానికి చెందిన గుజ్జుల మధుతో వెంకన్న తన మూడో కుమార్తె రమణకు వివాహం జరిపించాడు. అయితే వివాహం జరిగినప్పటి నుంచి మధు తన భార్య రమణను సరిగా చూసుకోకుండా, ఇతరులతో అక్రమ సంబంధాలు ఉన్నాయంటూ అనుమానాలు వ్యక్తం చేస్తూ తరచూ వేధింపులకు గురిచేసేవాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై గ్రామ పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయతీలు నిర్వహించినప్పటికీ మధు ప్రవర్తనలో మార్పు రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. తేదీ 13052026 సాయంత్రం సుమారు 5.30 గంటల సమయంలో మధు, రమణను పొలం దగ్గర నుంచి కొట్టుకుంటూ కర్ణం వాసు బావి వరకు తీసుకెళ్లాడని తెలిపారు. అక్కడ మృతురాలి కాళ్లలో ఉన్న మెట్టెలు, మెడలో ఉన్న పుస్తెల తాడు తీసేసి "ఈ బావిలో దూకి చావరాదే, నేను ఇంకో పెళ్లి చేసుకుంటా" అని బెదిరించి అక్కడే వదిలి వెళ్లిపోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నిండు గర్భిణీ రమణ అక్కడే ఉన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కురవి ఎస్ఐ బి. సతీష్ తెలిపారు.

## పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం



**విశాల భారతి, పరకాల :** గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశంతో పరకాల నడికుడ మండలంలో వరంగల్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో లో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఘనంగా పరకాల నడికుడ మండలంలోని హైబోథ్ పల్లి, వెంకటాపూర్, నాగారం, అలియాబాద్, వేల్లంపల్లి, పులిగిల్ల, గ్రామాలలో పోచంపల్లి ఫౌండేషన్ నిర్వాహకులు చందా కుమారస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా నడికూడ మండల మాజీ వైస్ ఎంపీపీ పోచంపల్లి ఫౌండేషన్ నిర్వాహకులు చందా కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలకు ఉచిత శిక్షణ ద్వారా మహిళలకు కేవలం కుట్టుపనే కాకుండా, ఆధునిక డిజైన్లు మరియు గార్మెంట్ మేకింగ్‌లో మెళకువలు నేర్పించడం జరుగుతుందన్నారు ఆర్థిక తోడ్పాటు తో పాటు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు సొంతంగా ఉపాధి పొందేలా అవసరమైన బ్యాంక్ రుణాలు మరియు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తామన్నారు. మరియు మహిళలు ఇంటి వద్దే ఉంటూ గౌరవప్రదమైన ఆదాయాన్ని గడించడానికి ఈ శిక్షణ ఒక చక్కని అవకాశం అని అన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మేడిపల్లి శోభన్ కుమార్ ,కొక్కిరాల రాకేష్ రావు, సమన్వయ సమితి సభ్యులు చింతిరెడ్డి సంబరెడ్డి, నందికొండ గణపతి రెడ్డి, నందికొండ జైపాల్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ గుండెబోయిన నాగయ్య, సురేందర్ రావు, కోరే రమేష్, ఆముదాలపెల్లి అశోక్ గంట సమ్మిరెడ్డి, హైబోత్ పల్లి సర్పంచి కాసాగాని సంపత్, వెంకటాపూర్ మాజీ సర్పంచ్ విద్యాసాగర్ రావు చంద్రకళ నాగారం గ్రామ సర్పంచ్ ఏరుకొండ రమాదేవి శ్రీనివాస్, పులిగిల్ల సర్పంచి ఇనుగాల ఐలయ్య, అలియాబాద్ గ్రామ సర్పంచి శాతరాసి సనత్ వేల్లంపల్లి మాజీ సర్పంచ్ గంట విజయ, పాలకుర్తి సదానందం నల్ల రాజిరెడ్డి , బిఆర్ఎస్వి హనుమకొండ జిల్లా మాజీ కోఆర్డినేటర్ పోచంపల్లి రఘుపతి, బిఆర్ఎస్ పార్టీ జిల్లా యువజన నాయకులు ఇంగిలి వీరేష్ రావు, రామంచ రాజు పిట్ట సునీల్, బండి వెంకటేష్ వివిధ గ్రామాల వార్డు సభ్యులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను బలోపేదం చేద్దాం

**విశాల భారతి, ఆర్మూర్:** ఆర్మూర్ మండలంలోని కొమన్పల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఆధ్వర్యంలో గురువారం రోజు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్ ఉప సర్పంచ్ కావ్య గౌడ్, ప్రవీణ్ గౌడ్ లు హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలను బలోపేదం చేద్దామని గ్రామంలోని ప్రతి ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం గ్రామంలో ఒకటి నుండి పదవ తరగతి వరకు ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తుందని. ప్రవేట్ పాఠశాలకు పిల్లలను తరలించకుండా గ్రామంలో ఉన్న పాఠశాలను కాపాడుకుందాం అని తెలిపారు. నాణ్యతమైన విద్య ప్రభుత్వ ఉపాధ్యాయులచే బోధించబడుతుందని. ప్రతి సంవత్సరం పదవ తరగతిలో 100% విద్యార్థులు మంచి మార్కులతో పాస్ అవుతున్నారని తెలిపారు.

# హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

## బండ కార్తీక చంద్రారెడ్డి

**సికింద్రాబాద్, విశాలభారతి :**

లాలాపేట లోని ప్రొఫెసర్ జయశంకర్ మున్సిపల్ స్టేడియం గ్రౌండ్ లో ఈనెల 16న శనివారం సాయంత్రం 5:30 గంటలకు జరగబోయే "హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తిక చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు హిందూ సమ్మేళన సభ" వాల్ పోస్టర్ను ఉత్సవ సమితి సభ్యుల తో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్తీక రెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు ఎలాంటి సమ్మేళనాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కావున ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హిందూ బంధువులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళనం ఉత్సవ సమితి నాయకులు కోటేశ్వరరావు, పార్వతీ పరమేష్, గోపాల్ చారి, కిరణ్ గౌడ్, కుమార్ షాను, శివారెడ్డి పాల్గొన్నారు.



# శర్వానంద్ జోడీగా?

ఇటీవల విడుదలైన 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రంలో చక్కటి అభినయంతో మంచి గుర్తింపు తెచ్చుకుంది మాజీ మిస్ ఇండియా మానస వారణాసి. ఈ సినిమా విజయంతో ఈ భామకు తెలుగులో భారీ ఆఫర్లొస్తున్నట్లు వినికిడి. తాజా సమాచారం ప్రకారం శర్వానంద్‌తో కలిసి ఆమె ఓ చిత్రంలో నటించబోతున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. శర్వానంద్ కథానాయకుడిగా శ్రీను వైట్ల దర్శకత్వంలో 'జార్జ్ క్రిష్' పేరుతో ఓ రొమాంటిక్ కామెడీ చిత్రం తెరకెక్కుతున్నది. ఈ సినిమాలో కథానాయికగా మానస వారణాసిని కంఫర్మ్ చేసినట్లు తెలిసింది. ఈ సినిమాలోని కథానాయిక పాత్ర కోసం అనంతిక సనీల్‌కుమార్, రుక్మిణి వసంత్, మమితాబైజు పేర్లు మొన్నటివరకూ వినిపించాయి. చిత్రబృందం చివరకు మానస వారణాసి వైపే మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నది.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.